
# తెలుగు మహాభారత రత్నమాల - 2

## (తెలుగు తాత్పర్య సహితము)




## తెలుగు మహాభారత సహస్రాబ్ది ఉత్సవ సమితి

## 2022-2023

## భారతీయ సమాఖ్య

(18 సాంస్కృతిక సంస్థల సమాహారం)

**తెలుగు మహాభారత రత్నమాల - 2**

సేకరణ : **డా॥ రేమెళ్ళ అవధానులు**
వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ వేదభారతి.

మొదటి ప్రచురణ : జూలై, 2022

ప్రతులు : 1000

వెల : **రూ॥ 50/-**

ప్రతులకు : **శ్రీ వేదభారతి**
'H Block' -34, మధురానగర్,
హైదరాబాద్-500 038.
Cell : 98494 59316
e.mail : shrivedabharathi@gmail.com
www.shrivedabharathi.in

ముద్రణ : సంహిత గ్రాఫిక్స్
అమీర్‌పేట, హైదరాబాద్.
ఫోన్ - 92462 71620

# కృతజ్ఞతలు

**భారతీయ సమాఖ్య**

(18 సాంస్కృతిక సంస్థల సమాహారం)

చేపట్టిన

**తెలుగు మహాభారత సహస్రాబ్ది ఉత్సవాలకు**

అపూర్వ సహాయ సహకారాలనందిస్తున్న

**శ్రీ బి.సిహెచ్.వి. సుబ్బారావు** గారికి

(ఛైర్మన్, భారత్ వికాస పరిషత్ ఛారిటబుల్ ట్రస్ట్)

కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారికి, వారి కుటుంబ సభ్యులకు,

పరమేశ్వరుడు పరిపూర్ణ అనుగ్రహమును ప్రసాదించుగాక!

అని ప్రార్థిస్తున్నాము.

**డా॥ రేమెళ్ళ అవధానులు**

శ్రీ వేదభారతి

హైదరాబాద్

01-08-2022

# తెలుగు మహాభారత  సహస్రాబ్ది ఉత్సవాలు

# 2022 - 2023

## "దేశభాషలందు  తెలుగులెస్స"

**తెలుగుభాష** భారతదేశంలోని అతి **ప్రాచీన భారతీయ భాష**లలో ఒకటిగా గుర్తింపబడింది. ఈ భాషకు ఒక స్థిరమైన, శాశ్వతమైన స్థానాన్ని ఏర్పాటుచేసినవాడు "రాజరాజ నరేంద్రుడు". ఇతను 10-11 శతాబ్దాలకు చెందిన మహారాజు. ఇతనికి తెలుగుభాషపై గల అపూర్వమైన అభిమానం కారణంగా  సంస్కృతంలోనే ఉన్న మహాభారతాన్ని తెలుగులోనికి అనువాదం చేయడానికి మహాకవి నన్నయ్యకు ప్రేరకుడయ్యాడు. తరువాత తిక్కన, ఎఱ్ఱాప్రగడల చేతులమీదుగా కొనసాగి పూర్తయింది.

**"రాజరాజ నరేంద్రుని పట్టాభిషేకం 1022లో ఆగష్టు 22వ తేదీన"** జరిగినట్లు  చరిత్రకారులు  నిర్ణయించారు.

**2022** సంవత్సరం నాటికి ఆ మహారాజు పట్టాభిషేకం జరిగి **వెయ్యి సంవత్సరాలు** అయిన సందర్భంలో, ఆ రాజరాజ నరేంద్రునికి, కవిత్రయానికి కృతజ్ఞతా సూచకంగా **"తెలుగు మహాభారత సహస్రాబ్ది"** ఉత్సవాలను **ఒక సంవత్సరం** పాటు ఘనంగా నిర్వహించాలని సంకల్పించడం జరిగింది.

అందులో అంతర్భాగంగా విద్యార్థులకు, యువతకు, మహాభారతంలోని కనీసం 108 పద్యాలను అందించాలనే తపనతో **"తెలుగు మహాభారత రత్నమాల-1, మరియు 2** (తెలుగు తాత్పర్య సహితము)" అనే పేరుతో పుస్తకాలను సంకలనం చేయడం జరిగింది. ఈ పద్యాలను చాలామంది విద్యార్థులు ఇప్పటికే కంఠస్థం చేయడం ప్రారంభించారు. పద్యాలను చదవడం నేర్పడం కొరకు **శ్రీ వేదభారతి (98494 59316) జూమ్ తరగతులను** నిర్వహిస్తోంది. ఉత్సాహం కలవారు వెంటనే సంప్రదించగలరు.

గత 50 సంవత్సరాలక్రితం ప్రతి తెలుగువానికి కంఠస్థంగా ఉండే శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు రచించిన పాండవోద్యోగములోని అతి ప్రసిద్ధమైన పద్యాలలో కొన్నిటిని ఎన్నుకొని, వాటిని కూడా ఇందులో అనుబంధంగా చేర్చడం జరిగింది.

ఈ మహత్తర తెలుగు భాషా ఉద్యమంలో తప్పక పాల్గొని, ఈ కార్యక్రమాలను దిగ్విజయం  చేయవలసిందిగా  కోరుతున్నాము.

***"తెలుగుభాషను రక్షించుకుందాం!!"***

ఇట్లు

**తెలుగు మహాభారత సహస్రాబ్ది ఉత్సవ కార్యనిర్వాహకవర్గము**

## తెలుగు మహాభారత రత్నమాల - 2

**1. జ్ఞానము కేవలకృప న**
**జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రజనితము సేయం**
**గా నది సకలధరిత్రీ**
**దానంబునకంటె నధికతరఫలద మగున్.** **శాంతి. 4-255**

**తాత్పర్యము :** కేవలం దయతో అజ్ఞానికి జ్ఞానాన్ని బోధించి, అతడిలో దేవునిగూర్చిన మోక్షాన్ని గూర్చిన, తెలివితేటలను ఏర్పరచగలిగితే, ఆ జ్ఞానబోధ గొప్ప దానంగా పరిణమిస్తుంది. ఆ విధంగా జ్ఞానదానం చేస్తే, ఆ దానం వలన ఫలితం, మొత్తం నేలను దానం చేయగా వచ్చే ఫలితాన్ని మించి ఉంటుంది.

**2. శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే**
**లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం**
**తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై**
**ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవశ్రీకన్ధరా శ్శ్రేయసే.** **ఆది.1-1**
(మహాభారతం ప్రారంభంలో, ఆదిపర్వంలో, నన్నయ్యగారి మొదటి పద్యం-సంస్కృతంలో)

**తాత్పర్యము :** ఏ విష్ణు బ్రహ్మ శంకరులు చిరకాలంనుండి క్రమంగా రొమ్మునందూ, ముఖమునందూ, దేహమునందూ లక్ష్మీ సరస్వతీ పార్వతులను ధరిస్తున్నవారై, స్త్రీ పురుషుల సంయోగం వలన పుట్టిన లోకాల సుస్థిరత్వాన్ని అవిచ్ఛిన్నంగా కలిగిస్తున్నారో, మూడు వేదాల రూపం కలవారున్నూ, దేవతల చేత పూజింపబడినవారున్నూ అయిన ఆ విష్ణు బ్రహ్మ శంకరులనబడే త్రిమూర్తులు మీకు శ్రేయస్సును కలిగించేవారౌతారు గాక!

**3. రాజకులైక భూషణుఁడు, రాజమనోహరుఁ, డన్యరాజతే**
**జోజయశాలి శౌర్యుఁడు, విశుద్ధయశశ్శరదిందు చంద్రికా**
**రాజిత సర్వలోకుఁ, డపరాజిత భూరి భుజా కృపాణ ధా**
**రాజల శాంత శాత్రవ పరాగుఁడు రాజమహేంద్రుఁడున్నతిన్** **ఆది.1-3**

**తాత్పర్యము :** చంద్రవంశానికి (క్షత్రియ వంశానికి, రాజసమూహానికి) ముఖ్యాలంకారమైనవాడు, చంద్రుడివలె అందమైనవాడు, పరరాజుల పరాక్రమాన్ని జయించటంచేత ప్రకాశించే శౌర్యం కలవాడు, నిర్మలమైన కీర్తి అనే శరత్కాలచంద్రుడి వెన్నెలచేత ప్రకాశింపచేయబడిన సమస్తలోకాలు కలవాడు, ఓటమి యెరుగని దీర్ఘమైన బాహువునందలి ఖడ్గముయొక్క వాదర అనే నీటి చేత అణగింపబడిన శత్రువులనే ధూళి కలవాడు అయిన రాజరాజ నరేంద్రుడు పెంపుతో.

**4. సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తి లో**
**నారసి మేలు నా, నితరు లక్షర రమ్యత నాదరింప, నా**
**నారుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా**
**భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్ ఆది.1-26**

**తాత్పర్యము :** కవిపుంగవులు ప్రశస్తమైన బుద్ధితో ప్రసాదగుణంతో కూడిన కథలందును, కవిత్వమందును (కథాకవిత్వమందు) కల మనోహరాలైన అర్థాలతోడి కూడికను (అర్థసంహితత్వాన్ని) లోపల తరచి తరచి గ్రహించి బాగుబాగు అని ప్రశంసించగా, అన్యులు (సామాన్యులు) వీనులకు విందు చేకూర్చే అక్షరాల కూర్పులోని సౌందర్యాన్ని మెచ్చుకోగా, హృద్యమైన అర్థాలతో కూడిన వివిధ సుభాషితాలకు (నీతులకు, జాతీయాలకు, నానుడులకు) - లేదా - అనేక రకాలైన రమణీయార్థ ప్రతిపాదకాలైన సుందర కవితాభి వ్యక్తులకు నిధానమైన నన్నయభట్టు లోకానికి శ్రేయస్సు కలిగేటట్లు మహాభారతం అనే వేదాన్ని రచించటంలో ఒప్పిదమైనవాడు (రచించటంచేత లోకప్రీతికరుడు) అయినాడు.

**5. నుతజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత**
**వ్రత! యొక బావిమేలు, మరి బావులు నూటిటికంటె నొక్క స**
**త్క్రతువది మేలు, తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు, త**
**త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడగన్ ఆది. 4-94**

**తాత్పర్యము :** సత్యవ్రతం గల ఓ రాజా! మంచినీటితో నిండిన చేదుడు బావులు నూరింటికంటె ఒక దిగుడు బావి మేలు కాగా, బావులు నూరింటికంటె ఒక మంచి యజ్ఞం మేలు, అటువంటి నూరు యజ్ఞాలకంటె ఒక పుత్రుడు మేలు. అట్టి పుత్రులు నూరుమందికంటె ఒక సత్యవాక్యం మంచిది.

**6. అనిలుఁడు పక్షయుగ్మ మమృతాంశుఁడు వీపనలుండు మస్తకం**
**బినుఁడు సమస్త దేహమును నెప్పుడుఁ గాచుచు నీ కభీష్టముల్**
**ఘనముగ జేయుచుండెడు జగన్నుత! ఉన్నతియున్ జయంబు జే**
**కొనుమని యిచ్చె దీవెనలు గోరి ఖగేంద్రునకున్ ప్రియంబునన్**
**ఆది. 2–56**

**తాత్పర్యము :** "వాయువు రెక్కలజంటను, చంద్రుడు వీపును, అగ్ని తలను, సూర్యుడు ఎల్ల శరీరాన్ని సర్వదా రక్షిస్తూ నీ కోరికలు గొప్పగా తీరుస్తూ ఉంటారు గాక! లోకాలచేత నుతింపబడేవాడా! గొప్పతనాన్ని, విజయాన్ని గ్రహించుము" అని వినత మనసులో కోరి పక్షులకు రాజయిన గరుడునికి ప్రీతితో ఆశీస్సులు ఇచ్చింది.

**7. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులం**
**జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో**
**దారసమీరసౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణ క**
**ర్పూరపరాగపాండురుచిపూరము లంబరపూరితంబు లై.** అరణ్య.4-141
(మహాభారతం అరణ్యపర్వం మధ్యలో, నన్నయ్యగారి ఆఖరి పద్యం)

**తాత్పర్యము :** అవి శరత్కాలంలోని రాత్రులు, మిక్కిలి ప్రకాశమానాలైన నక్షత్ర మాలికలతో కూడి ఉన్నవి, వికసించిన కొంగ్రొత్త తెల్లకలువల దట్టమైన సుగంధంతో కూడిన గొప్పగాలి యొక్క పరిమళాన్ని వహించాయి. అంతటా వెదజల్లబడిన కప్పురపు పుప్పొడివలె ఆకసాన్ని ఆవరించిన చంద్రుడి వెన్నెల వెల్లువలు కలిగి మిక్కిలి సొగసుగా ఉన్నాయి.

**8. స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా**
**వరణము లై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల ను**
**ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ సెలంగగాఁ**
**గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడగన్.** అరణ్య.4-142

(మహాభారతం అరణ్యపర్వం మధ్యలో, ఎఱ్ఱాప్రగడగారి మొదటి పద్యం)

**తాత్పర్యము :** శరత్కాలంలో సూర్యోదయం సమయాలు కనుల పండువుగా శోభిల్లాయి. అప్పుడు మబ్బులు క్రమ్మటాలు తొలగిపోయాయి. బాలభానుడి అరుణకిరణాలు విస్తరించాయి. పద్మాలు వికసించి, శోభాయమానంగా వెలుగొందాయి. హంసలు, బెగ్గురుపిట్టలు, తుమ్మెదలు చేసే కలరవాలు వెల్లివిరిశాయి.

**9. వినయము విస్తరిల్ల గురువృద్ధ జనాతిథి విప్రదేవతా**
**ర్చనలొనరింతు, సత్యము శౌచము నేమఱ, నీగి మన్ననం**
**తనుపుదు భృత్యబంధుతతిఁ, దాల్మివహింతు, నసూయఁ జేయ, నెం**
**దును మదిఁ దృష్ణసొన్పఁ, బరదోష కథావిముఖుండ నెప్పుడున్.**
**అరణ్య.5-34**

**తాత్పర్యము :** నేను మిక్కిలి అణుకువతో కూడిన ప్రవర్తనతో గురువులను, పెద్దలను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను, పూజిస్తాను. సత్యవ్రతాన్ని పాటిస్తాను. పరిశుభ్రతను ఎన్నడూ మరవను. సేవకులకు దానాలిస్తాను. బంధువులను మర్యాదలు చేసి మన్నిస్తాను. ఓర్పును వహిస్తాను. అసూయ చెందను. ఎట్టి విషయాలలోను మిక్కుటమైన కోరికలను పెంచుకోను. ఎప్పుడూ ఇతరుల దోషాలను గూర్చిన ప్రసంగాలను వినను.

**10. హలికుండెంతయు నోజతోఁదునగ సీరాగ్రంబునం జోఁకిప్రా**
**ణు లనేకంబులు సచ్చు, హింసయది యౌనొకాదో! వేయేల? మ**
**ర్త్యులు నేలం జరియించుచోఁ బదములం ద్రొక్కంబడుం బెక్కు జం**
**తులు హింసావిధి గాదనంగ వశమే దోషజ్ఞ! యూహింపుమా!**
**అరణ్య.5-57**

**తాత్పర్యము :** ఓ పండితోత్తమా! నాగలితో రైతు భూమిని దున్నేటప్పుడు, ఆ నాగలికర్రుకు తాకి ఎన్ని జీవాలు చచ్చిపోవటం లేదు? అది హింసకాదని వాదించటానికి వీలున్నదా? తర్జన భర్జనలు అనవసరం. మనుజులు నేలపై నడచేటప్పుడు కూడా వేలకొలది ప్రాణులు చనిపోతున్నాయి. అది హింస కాదని వాదించటానికి వీలు లేదు కదా! ఈ విషయాన్ని దయచేసి నీవే ఆలోచించి తేల్చుకొనుము.

**11. భూత హితంబుగాఁ బలుకు బొంకును సత్య ఫలంబు నిచ్చుఁ ద**
**ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకు నట్ల ప్రా**
**ణాతురుఁ డైనచోఁ బరిణయంబున యందును బల్కు బొంకు స**
**త్యాతిశయంబ యండ్రు, మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్ములల్.**

**అరణ్య. 5-62**

**తాత్పర్యము :** ఓ మహానుభావా! ధర్మాన్ని ప్రస్తరిస్తే అగోచరాలైనను ముఖ్యాలైన చిన్న అంశాలుగా విడిపడుతుంది. ప్రాణికోటికి మేలు జరగటానికై చెప్పబడిన అసత్యం సత్యం కంటే కూడా గొప్పది. ప్రాణికోటికి కీడు గలిగించే సత్యం అసత్యంతో సమానం. ప్రాణరక్షకూ వివాహం జరిపించటానికీ ఆడిన అసత్యం సత్యం కంటే ఘనమైనది. ఇవి ధర్మసూక్ష్మాలు సుమా!

**12. ఎంతయు వృద్ధులై తమకు నీ వొకరుండవ తెప్ప గాఁగ న**
**త్యంతముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని**
**శ్చింతుఁడవై సదాధ్యయన శీలత వారియనుజ్ఞ లేక యే**
**కాంతమ యెమ్మెయిన్ వెడలితక్కట! నీవు గరంబు క్రూరతన్**

**అరణ్య. 5-120**

**తాత్పర్యము :** నీ తల్లిదండ్రులు మిక్కిలి ముసలివారు. వారికి నీవు ఒకడివే ఆధారం. నీమీదనే తమ ప్రేముడిని అంతయు పెట్టుకొని బ్రదుకుతున్న నీ తల్లిదండ్రులను వదలిపెట్టావు. వారిని వదలివచ్చేటప్పుడు నీవు వారి అనుమతిని తీసికొనలేదు. నీవు వేదాధ్యయనం చేసి జ్ఞానాన్ని అర్జించి, తరింపనెంచావు. కాని, నీ తల్లిదండ్రులగతి ఏమవుతుందో అని ఆలోచించలేదు. కఠినమైన నీ ప్రవర్తన నాకు నచ్చలేదు.

**13. అమితవైభవ! లోభమోహమదాదిదుర్లభ! మంజువి**
**భ్రమ విలాసితకామినీజన పంచబాణ! నిరంతరా**
**నమదశేషనృపాలమౌళి పినద్ధముగ్ధమణిప్రభా**
**క్రమ సమంచిత విస్ఫురత్పదకాంతి నిర్జితపంకజా!   అరణ్య.7-472**

(మహాభారతం అరణ్యపర్వం చివరలో, ఎఱ్ఱాప్రగడగారి ఆఖరి పద్యం)

**తాత్పర్యము :** అపారమైన సంపదకలవాడా! పిసినారితనం, అజ్ఞానం, గర్వం మొదలైన గుణాలకు దుర్లభుడైనవాడా! అందమైన శృంగార చేష్టలచేత ప్రకాశించే స్త్రీలకు మన్మథుడైనవాడా! ఎల్లప్పుడూ నమస్కరిస్తున్న అంతులేని రాజుల శిరస్సులపై కట్టబడిన అందమైన మణులకాంతలచే ప్రకాశిస్తున్న పాదాల కాంతిచే జయింపబడిన పద్మాలుగలవాడా! అనగా సామంతులు శిరస్సుమోపి నమస్కరించగా వారి శిరోమణుల కాంతలచే అతని పాదాలు కాంతిచే పద్మాలను తిరస్కరిస్తూ ఉన్నవని భావం (రాజరాజనరేంద్రా!)

**14. శ్రీయన గౌరినాఁ బరగు చెల్వకుఁ జిత్తము పల్లవింప భ**
**ద్రాయితమూర్తి యై హరిహరంబగు రూపము దాల్చి "విష్ణు రూ**
**పాయ నమశ్శివాయ" యని పల్కెడు భక్తజనంబు వైదిక**
**ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్. విరాట.1-1**

(మహాభారతం, విరాటపర్వంలో, తిక్కనగారి మొదటి పద్యం)

**తాత్పర్యము :** శ్రీ (లక్ష్మీ) అనీ, గౌరి (పార్వతి) అనీ పిలువబడే వనితకు మనసు చిగురించేట్లు మంగళకరమైన హరిహరులు కలిసిన రూపాన్ని ధరించి, 'విష్ణు రూపుడైన శివుడికి నమస్కార'మని కీర్తించే భక్తుల వేదవిహితమైన ఉపాసనా పద్ధతికి మనసులో మెచ్చుకొనే ఆ పరమాత్మను (పరబ్రహ్మతత్త్వాన్ని) నా కోరిక ఫలించాలని ప్రార్థిస్తున్నాను.

**15. కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁగ్రోలి యాం**
**ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్కృతి**
**శ్రీ విభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ**
**క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్.**

**విరాట.1-30**

**తాత్పర్యము :** అందువలన - ఆంధ్రులందరూ దొప్పలవంటి చెవులతో మహాభారతమనే అమృతాన్ని తనివితీరా త్రాగి, ఆహ్లాదాన్ని పొందేట్లుగా - వ్యాస మహర్షి భావనమనే సంపదయొక్క వైభవంతో నిండిన మనస్సుతో భారతపర్వాలను మహాకావ్యంలో ఉండదగిన ఉత్తమ కవిత్వంతో రచించవలె నన్న గొప్ప దీక్షను పూని నియమంతో పద్యాలలోనూ గద్యాలలోనూ (అంటే చంపూ రచనగా) రచిస్తాను.

**16. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు, రా**
**లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే?**
**హెచ్చుగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు, టట్లుగా**
**కిచ్చ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొందగు చేఁతయుం దగున్.**
**విరాట. 4-234**

**తాత్పర్యము :** ఇప్పుడు మనపైకి దండెత్తి వచ్చినవాడు అర్జునుడు. మనమే తప్పక జయిస్తామని చెప్పలేము. రాజ్యలక్ష్మి కొరకు పెనగులాడితే రెండు బలాలూ గెలవలేవు కదా! జయం కలుగవచ్చును. కలుగకపోవచ్చును. ఇప్పుడు మనం చేయగలిగిందల్లా ఏమి వచ్చినా ఓర్చుకొనటమే. అంతేకాక ఒకరకంగా ఇప్పుడు సంధి చేసికొనటం కూడా మంచిపనే!

**17. వరమునఁ బుట్టితిన్, భరత వంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ**
**వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి, నీతి విక్రమ**
**స్థిరులగు పుత్త్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్**
**సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్.** **ఉద్యోగ.3-108**

**తాత్పర్యము :** కృష్ణా! నేను దేవతావర ప్రసాదం వలన జన్మించాను. భరతవంశం మెట్టాను. భరతకుల ప్రసిద్ధుడైన పాండు మహారాజుకు కోడలినైనాను. జనులచేత నమస్కరించదగిన భర్తలను పొందాను. రాజనీతిలోనూ, శౌర్యంలోనూ చలించని ఉత్తమ పుత్రులను కన్నాను. తోబుట్టువుల తోడు నాకున్నది. ఇన్ని విధాల నేను ప్రఖ్యాతి గడించాను.

**18. పగ యడఁగించుటెంతయు శుభం బదిలెస్స, యడంగునే పగం**
**బగ? పగగొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం**
**దెగ మొదలెత్తిపోవ బగదీర్పఁగ వచ్చిన గ్రౌర్యమొందు, నే**
**మి గతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా!**

**ఉద్యోగ. 3-21**

**తాత్పర్యము :** విరోధాన్ని అణచివేయడం ఎంతో శ్రేయస్కరం. అది మంచి పని. విరోధం వలన విరోధం సమసిపోదు. ఒకడు వైరం వహించి మరొకరికి బాధ కలిగిస్తే, బాధపెట్టిన వాడితో తలపడక ఊరకుండటం శక్యం గాదు. పరమ సాహసంతో తుదముట్ట పగను నిర్మూలించటానికి పూనుకొంటే దారుణ కృత్యాలకు ఒడిగట్టవలసివస్తుంది. కనుక, ఎన్నివిధాల ఆలోచించినా పగ వలన కీడేగాని మరే ప్రయోజనం శూన్యం. కృష్ణా! ఇది నిజం.

**19. అకృతక మధురోక్తి వ్యాప్త సందీప్త సారా!**
**సకల భువన రక్షాశాలి శుంభద్విహారా!**
**శుకజనకమనీషా శుద్ధ బుద్ధానుభావా!**
**సకృపకృత విలాసా! సంభృతానందభావా! స్వర్గారోహణపర్వము 97**

(మహాభారతం చివరలో, ఆఖరి పద్యం-తిక్కనగారి రచన)

**తాత్పర్యము :** నిత్యమధురాలైన వేదవాక్యాలలో నీ ప్రకాశం సర్వత్రా వెలుగుతున్నది. సకల భువన రక్షణ రూపమే నీ విహారం. వేదవ్యాసుడు నిన్ను శుద్ధజ్ఞాన స్వరూపిడిగా వర్ణించాడు. భక్తుల సముద్ధరణకొరకు నీవు దయతో అనేక లీలలు ప్రదర్శిస్తావు. నీవు సంపూర్ణానంద స్వరూపుడివి.

❖ ❖ ❖

**20. భారతభారతీశుభగభస్తిచయంబులఁజేసి ఘోరసం**
**సారవికారసంతమస జాలవిజృంభముఁ బాచి సూరిచే**
**తోరుచిరాబ్జ బోధనరతుం దగుదివ్యఁబరాశరాత్మజాం**
**భోరుహమిత్రుఁ గొల్చి మునిపూజితు భూరియశోవిరాజితున్.**

**నన్నయ్య - ఆది. 1-22**

**తాత్పర్యము :** భారతంలోని వాక్కులనే మంగళకరాలైన కిరణ సముదాయాలచేత భయంకరమైన సంసారంలోని వికృతులు అనే దట్టమైన చీకట్లయొక్క అతిశయాన్ని పోగొట్టి, పండితుల హృదయాలనే ప్రకాశించే పద్మాలను వికసింపచేయటంలో ఆసక్తికలవాడున్నూ, యోగ్యుడున్నూ, దేవతాతుల్యుడున్నూ, మునులచే పూజింపబడినవాడున్నూ, అధికమైన కీర్తిచేత ప్రకాశించేవాడున్నూ అయిన వ్యాసుడనే సూర్యుడిని సేవించి.

**21. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులు వేదాంతమనియు,**
**నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులు మహాకావ్యమనియు,**
**లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని యైతిహాసికు లితిహాసమనియుఁ,**
**బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ యంబని మహిఁ గొనియాడుచుండ**
**వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁ**
**డాదిముని పరాశరాత్మజుండు**
**విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై**
**పరఁగు చుండఁ జేసి భారతంబు** **ఆది.1-32**

**తాత్పర్యము :** ధర్మప్రభావం తెలిసినవారు ధర్మశాస్త్రగ్రంథమనిన్నీ, పరమాత్మ జీవాత్మల సంబంధం తెలిసిన వేదాంతులు వేదాంతశాస్త్రమనిన్నీ, నీతి విషయాలయందు నేర్పుకలవారు నీతులను తెల్పే శాస్త్రమనిన్నీ, కవిశ్రేష్ఠులు గొప్ప కావ్యమనిన్నీ, లక్షణం తెలిసినవారు పెక్కు లక్ష్యాల సంపుటి అనిన్నీ, పూర్వకథలు తెలిసినవారు, ఇతిహాసమనిన్నీ, ఉత్తమ పౌరాణికులు పెక్కు పురాణాల సమూహమనిన్నీ, భూమియందు పొగడుతూ ఉండగా సర్వవేదాల సత్యస్వరూపాన్ని ఎరిగినవాడున్నూ, వేదాలను విభజించి వేదవ్యాసుడనే పేరు పొందినవాడున్నూ, ప్రాచీనమునియున్నూ, విష్ణువుతో సమానుడున్నూ అయిన పరాశరుని కుమారుడు (కృష్ణద్వైపాయనుడు) సర్వజనులకు హితమై ఒప్పేటట్లుగా సంస్కృతంలో భారతమనే గ్రంథాన్ని రచించాడు.

**22.** **తగునిది తగదని యెదలో**
**వగవక సాధులకుఁ, బేదవారల కెగ్గుల్**
**మొగిఁజేయు దుర్వినీతుల**
**కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్** **ఆది. 1-85**

**తాత్పర్యము :** ఈ పని యుక్తమైనది కాదు అని మనస్సులో ఆలోచించకుండానే బీదవారికీ, అశక్తులైనవారికీ, మంచివారికీ అపకారాలు పూనికతో చేసే నీతిరహితులకు కారణం లేకుండానే ఆపదలు వస్తూ ఉంటాయి.

**23.** **మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్**
**పరఁగఁ బెక్కుసేసి పడయఁబడిన**
**యట్టి యెఱుక జనుల కాక్షణ మాత్రన**
**చెఱుచు మద్యసేవ సేయ నగునె.** **ఆది. 3-120**

**తాత్పర్యము :** పూర్వమందలి అనేక జన్మాలలో పుణ్యకార్యాలను ఒప్పుగా అనేకం చేసి పొందబడిన జ్ఞానం జనాలకు క్షణమాత్రంలోనే పోగొట్టే మద్యపానం చేయదగునా?

**24.** **తనయుండు దల్లిదండ్రులు**
**పనిచిన పని సేయఁడేని పలుకెడలోఁ జే**
**కొనఁడేని వాఁడు తనయుం**
**డనఁబడునే? పితృ ధనమున కర్హుండగునే?** **ఆది. 3-199**

**తాత్పర్యము :** కొడుకు తల్లిదండ్రు లాజ్ఞాపించిన పని చేయకపోతే, వారి వాక్యం హృదయంలో అంగీకరించకపోతే అట్టివాడు కొడుకు అనబడతాడా? తండ్రి సొమ్ముకు తగినవాడు అవుతాడా? కాదు.

**25.** **ఎఱుక గలవారి చరితలు**
**గఱచుచు సజ్జనులగోష్ఠిఁ గదలక ధర్మం**
**బెఱుఁగుచు నెఱిఁగిన దానిని**
**మఱవ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్.** **ఆది. 3-203**

**తాత్పర్యము :** జ్ఞానం కలవారు ప్రవర్తించిన తీరు తెన్నులను చక్కగా నేర్చుకోవాలి. మంచివారు ప్రసంగాలు చేస్తూ ఉండే సందర్భాలలో శ్రద్ధతో ధర్మాన్ని తెలుసుకోవాలి. తెలుసుకున్నదానిని మఱచిపోకుండా పద్ధతి తప్పని బుద్ధితో ఆచరించాలి.

**26. విమలయశోనిధీ! పురుషవృత్త మెరుంగుచు నుండుఁ జూవె వే**
**దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్**
**యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా**
**ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొన నేర్చునె తన్ను ట్రుచ్చిలన్.**
**ఆది. 4-80**

**తాత్పర్యము :** స్వచ్ఛమైనకీర్తికి నిధియైన ఓరాజా! వేదాలూ, పంచభూతాలూ, ధర్మమూ, సంధ్యలూ, అంతరాత్మా, యముడూ, చంద్ర సూర్యులూ, పగలూ, రాత్రీ అనేపదార్థాలు మానవుల నడవడిని గమనిస్తూనే ఉంటాయి. ఇవన్నీ ఉండగా మనిషి దొంగతనం చేసి (తన్ను తాను మోస పుచ్చుకొని) తప్పించుకోగలడా?

**27. మతిఁ దలఁపఁగ సంసారం**
**బతిచంచల మెండమావు లట్టుల సంప**
**త్ప్రతతు లతిక్షణికంబులు**
**గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్. ఆది. 5.159**

**తాత్పర్యము :** మదిలో ఆలోచిస్తే సంసారం చాలా చంచలం. సంపదల పెద్దపెద్ద రాశులు ఎండమావులలాగా క్షణంలో అంతరించి పోయే స్వభావం కలవి. పోయినకాలం వచ్చేకాలం కంటె మేలైనది.

**28. అనఘుల, శాస్త్రవిధిజ్ఞుల**
**ననురక్తులఁ, బితృపితామహక్రమమున వ**
**చ్చిన విప్రుల మంత్రులఁగా**
**నొనరించితె కార్యసంప్రయోగముపొంటెన్. సభా. 1.26**

**తాత్పర్యము :** నాయనా! యుధిష్ఠిరా! నీపనులు చక్కగా సిద్ధించటంకోసం పాపస్పర్శలేనివారు, శాస్త్రవిధానాలు చక్కగా తెలిసినవారు, తండ్రితాతల వరుసలో వచ్చిన జ్ఞానసంపన్నులూ అయిన వారిని మంత్రులనుగా నియమించుకొన్నావా?

**29.** **పితృ సంకల్పము సేయఁగ**
**సుతుల కవశ్యమును వలయు, సుత జన్మ ఫలం**
**బతి ముదమునఁ బితృవరులకు**
**హిత మొనరించుటయ కాదె యెంతయు భక్తిన్** **సభా. 1.94**

**తాత్పర్యము :** తండ్రి కోర్కెను తీర్చటం తనయుల విధి. పుత్రుడుగా పుట్టినందుకు ఫలం పితృదేవులకు ఎంతో భక్తితో, సంతోషంతో మేలు చెయ్యటమే కదా!

**30.** **అర్థమ యనర్థ మూలం**
**బర్థమ మాయా విమోహ నావహము, నరుం**
**డర్థార్జన దుఃఖమున న**
**పార్థీకృత జన్ముఁడగుట పరమార్థ మిలన్** **అరణ్య. 1-28**

**తాత్పర్యము :** అన్ని చెడుగుడులకు ధనమే మూలకారణం. ధనం మాయచేత ఏర్పడే భ్రాంతికి ఆకారం. మనుజుడు ధన సంపాదన వలన ఏర్పడే దుఃఖంవలన వ్యర్థజన్ముడవుతాడనేమాట భూలోకంలోని మేటి సత్యం.

**31.** **కార్యగతుల తెఱఁగు కలరూపు చెప్పిన**
**నధికమతులు దాని నాదరింతు**
**రల్పకార్యబుద్ధు లగువారలకు నది**
**విరసకారణంబు విషమపోలె.** **అరణ్య. 1-59**

**తాత్పర్యము :** ఒకపనిని చేసేవిధానాన్ని చక్కగా (ఎలా, ఎప్పుడు, ఎందుకు, ఎక్కడ చేయాలి అనే విచారణను) తెలిసినవాడు తెలియజెపితే దొడ్డబుద్ధి కలవారు దానిని ప్రీతితో గ్రహిస్తారు. బుద్ధితక్కువవారికి అది విషంలాగా వికారాన్ని పుట్టించటానికి కారణం అవుతుంది.

**32. ధర్మజ్ఞులైన పురుషులు**

**ధర్మువునకు బాధ సేయు ధర్మువు నైనన్**
**ధర్మముగా మదిఁ దలపరు**
**ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్**

**ఎఱ్ఱాప్రగడ - అరణ్య. 3-230**

**తాత్పర్యము :** ధర్మస్వరూపాన్ని ఎరిగిన జ్ఞానులు ధర్మానికి ఏమాత్రం కీడు కలిగించే ధర్మాన్నైనా, ధర్మంగా మనస్సులో భావించరు. అచ్చమైన ధర్మం జగత్తు కంతటికీ మేలు చేకూర్చాలి.

**33. ఆలస్యంబొక యింత లేదు; శుచి యాహారంబు; నిత్యక్రియా**
**జాలం బేమఱ; మర్చనీయు లతిథుల్; సత్యంబ పల్కంబడున్;**
**మేలౌశాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిం దాల్తు మట్లౌట నె**
**క్కాలంబుం బటు మృత్యురోగ భయ శంకం బొంద మే మిమ్ములన్.**

**అరణ్య. 4-190**

**తాత్పర్యము :** సోమరితనం మాలో కొంచెం కూడ ఉండదు. ఏదోషమూ లేని ఆహారం మాది. ప్రతిదినం చేయవలసిన అగ్నిహోత్రాదికార్యాలను ఉపేక్షించం. అతిథులను ప్రేమాదరాలతో పూజిస్తాం. సత్యమునే పల్కుతాం. ఇంద్రియాలనూ మనస్సునూ గట్టిగా అదుపులో పెట్టుకొని బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఉంటాం. ఈ కారణాలచేత మాకు ఎప్పుడూ ఎక్కడా చావు, జబ్బు, భయము అనే వాని సంశయం కూడా కలగదు.

**34. అంబ! నవాంబుజోజ్జ్వలకరాంబుజ! శారదచంద్ర చంద్రికా**
**డంబరచారుమూర్తి! ప్రకటస్ఫుటభూషణరత్నరోచిరా**
**చుంబిత దిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ! భా**
**వాంబరవీథి విశ్రుతవిహారి! ననుం గృపఁజూడు భారతీ! అరణ్య.4-216**

**తాత్పర్యము :** అమ్మా! భారతీ! నీవు కొంగ్రొత్త పద్మాన్ని పద్మంవంటి నీచేతిలో ధరించి ఉన్నావు. శరత్కాలపు చంద్రుని వెన్నెల చాలా ఎక్కువదట్టంగా ఉంటే, దాని వంటి మనోజ్ఞమైన ఆకారం నీది. నీవు ధరించిన నగల రత్నకాంతులు దిక్కులచివరలను తాకుతూ వానిని కాంతికలవిగా చేస్తున్నాయి. వేదసూక్తాలు నీప్రభావాన్ని చక్కగా చాటిచెబుతున్నాయి. హృదయంలోని ఆకాశమార్గంలో నీయీమహిమ ప్రకటితమవుతూ వినవస్తూ ఉంటుంది. నన్ను దయచూడు తల్లీ!

**35. విలయపయోధిమగ్న మగు విశ్వమహీవలయంబు దొల్లి యే**
**నలఘువరాహవిగ్రహుఁడనై వెస నెత్తితి; శేషమూర్తి నై**
**లలితఫణాసహస్రకము లావునఁ దాల్తు నశేషధాత్రియున్**
**జలనిధినిమ్నగానగలసన్నగరీవనమండలంబుతోన్.** అరణ్య.**4-270**

**తాత్పర్యము :** నేను మునుపు సమస్తమైన భూమండలమూ ప్రళయ సముద్రంలో మునిగిపోయినపుడు గొప్పసూకరదేహం తాల్చి దానిని పైకెత్తి ఉంచాను. తరువాత ఆదిశేషునిరూపంతో సుకుమారమైన వేయిపడగలమీద సమస్తమైన భూమినీ, సముద్రాలతో, నదులతో, కొండలతో, నగరాలతో, అడవులతో పాటుగా ధరించి ఉన్నాను.

**36. అనయంబున్ శ్రుతవంతుఁడై వినుతశిష్టాచారమార్గంబులం**
**జనుపుణ్యాత్ముఁడు దుర్గముల్ గడచి ప్రజ్ఞాహర్మ్యసంరూఢుఁడై**
**కనుచుండుం బటుమోహ పంకజలమగ్నం బైనలోకంబు వీఁ**
**క నధోభాగమునందు డింది కడు దుఃఖం బొందఁగా నవ్వుచున్.**
అరణ్య.**5-50**

**తాత్పర్యము :** విద్యకలవాడు ఎప్పుడూ గొప్పగా కొనియాడబడే నిష్ఠగల వారి ఆచారాలదారిలో మెలగే పుణ్యాత్ముడై ప్రజ్ఞ అనే మహాభవనం పైభాగాన్ని ఎక్కి, గట్టిమోహమనే బురదనీటిలో కూరుకొనిపోయి ఉన్న లోకం క్రింది భాగంలో చాలా దుఃఖం పొందుతూ ఉండగా, నవ్వుతూ చూస్తూ ఉంటాడు.

**37. శరణం బని వచ్చినభీ**
**కర శత్రుని నయినఁ బ్రీతిఁ గావఁగ వలయుం;**
**గరుణాపరుల తెఱం గిది;**
**యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్. అరణ్య. 5-413**

**తాత్పర్యము :** కాపాడు మహాప్రభో అని వచ్చిన భయంకరుడైన శత్రువును కూడా ప్రీతితో కాపాడాలి. దయ నిండుగా గలవారి తీరు ఇట్టిది. మరి ఏధర్మాలు కూడా ఇలా కాపాడటానికి సమానం కావు.

**38. ఎన్నడు నిట్టిసాహసము లింక నొనర్పకుమయ్య; దుర్జనుం**
**డన్నన సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ గావునం**
**గ్రన్నన తమ్ములన్ దొరలఁ గైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్;**
**సన్నుత దీని కొండొకవిషాదముఁ బొందకుమీ మనంబునన్.**
**అరణ్య. 5-434**

**తాత్పర్యము :** నాయనా! ఎప్పుడూ ఇటువంటి తొందరపాటు పనులు చేయబోకు. చెడ్డమనిషి ఒళ్లుతెలియక తొందరపాటు పనులకు పూనుకొని నశించిపోతాడు. నీతమ్ముళ్లనూ తక్కిన రాజులనూ తీసుకొని వెంటనే బుద్ధిగా పురానికి పో. ఈ అవమానానికి మనస్సులో దుఃఖం పెట్టుకోకు.

**39. కృతము దలంచి చిత్తమునఁ గిల్బిష మంతయు నుజ్జగించి స**
**మ్మతులఁ బృథాతనూజుల నమానుషతేజులఁ బిల్వఁ బంచి త**
**త్పితృధనమైనరాజ్యము నభీష్టముగాఁ దగ నిమ్ము నీకు నీ**
**క్షితివలయంబునం బరమకీర్తియుఁ బుణ్యముఁ గల్గు భూవరా!**
**అరణ్య. 6-37**

**తాత్పర్యము :** రాజా! వారు నీకు చేసిన ఉపకారాన్ని చక్కగా భావించి, మనస్సులో పాపభావాన్ని పూర్తిగా వదలివేసి మంచివారు, దేవతలవంటి తేజస్సు గలవారూ అయిన కుంతీదేవి కొడుకులను పిలిపించి వారితండ్రిదైన రాజ్యాన్ని ప్రీతిపూర్వకంగా వారి కిచ్చివేయి. అలా చేస్తే నీ కీభూమండలంలో గొప్పకీర్తీ, పుణ్యమూ కలుగుతాయి.

**40. ప్రీతుండై చనుదెంచె నాశ్రితజనాభీష్టక్రియాశీలుఁ డు**
**ద్గీతామ్నాయుఁడు నిర్విధూతదురితక్లేశుండు యోగామృత**
**స్ఫీతస్వాంతుఁ డనంతసంతతసమావిర్భూత కారుణ్య ధా**
**రా తోయస్నపనైక శీలుఁడగు పారాశర్యుఁ డచ్చోటికిన్.** అరణ్య.6-103

**తాత్పర్యము :** ఆవేదవ్యాసమహర్షి తన్ను ఆశ్రయించిన జనుల కోరికలను తీర్చటమే శీలమైనవాడు. నిరంతరమూ వేదాలను ఆవృత్తిచేస్తూ ఉండేవాడు. పూర్తిగా తుడిచివేసిన పాపాల కష్టాలు కలవాడు. యోగమనే అమృతంతో శక్తిమంతమైన అంతరంగం కలవాడు. ఎల్లవేళల అంతులేకుండా జాలువారుతూ ఉన్న దయ అనే నీటితో అందరినీ స్నానమాడించే స్వభావం కలవాడు. అట్టిమహర్షి అక్కడికి ప్రీతితో విచ్చేశాడు.

**41. అన్యాయార్జిత మైనవిత్తమునఁ జేయం బూనుదానంబు మూ**
**ర్ఖన్యాయం బది; దానఁజేసి ఫలపాకం బేమియున్ లేదు; యు**
**క్తన్యాయార్జిత మించుకంత యయినం గాలంబు దేశంబు స**
**మ్మాన్యం బై తగఁ బాత్రయోగమున సౌమ్యంబై ఫలించుం దుదిన్.**
**అరణ్య.6-112**

**తాత్పర్యము :** పాడితప్పి సంపాదించిన ధనాన్ని దానం చేయటం బుద్ధిహీనుల పరిపాటి. అట్టి దానం వలన పుణ్యఫలం సిద్ధించదు. సరియైన పద్ధతిలో పాడి తప్పక అర్జించిన ధనాన్ని కొంచెంగానైనా దానం చేయటం వలన గొప్ప సుకృతం సిద్ధిస్తుంది. దానం మంచి ఫలితాలనివ్వటానికి చూడవలసినవి మూడు ముఖ్యాంశాలు. 1. దానం సకాలంలో ఇవ్వబడాలి. 2. దానం సరియైన ప్రదేశంలో ఇవ్వబడాలి. 3. దానం పాత్రుడికి, యోగ్యుడికి చెందాలి.

**42. తనువృత్తాంగుఁడు శుద్ధకాంచనసముద్యద్వర్ణుఁ డత్యుల్లస**
**ద్వనజాతాయతచారులోచనుఁడు దీవ్యద్భూరితేజోఘనుం**
**డనఘుం డుల్లరథంబుపై వెలుఁగుపుణ్యాత్ముండు ధర్మాత్మజుం**
**డనిరోధప్రతిభాప్రభావనిధి యత్యాశ్చర్యశౌర్యుం డనిన్.** అరణ్య.6-207

**తాత్పర్యము :** అడుగో! అనతిదూరంలో కన్పిస్తున్న రథంపై వెలుగొందుతున్నవాడు ధర్మనందనుడు. సన్నని గుండ్రని శరీరం కలవాడు. అచ్చమైన బంగారు రంగుతో మిలమిలలాడే దేహకాంతి కలవాడు. అప్పటికప్పుడే వికసించిన పద్మాలవలె అందమైన వాలుగన్నులు కలవాడు. దేదీప్యమానమైన వర్చస్సుతో వెలుగొందేవాడు. పుణ్యశీలంకల మహానుభావుడు. యుద్ధంలో అప్రతిహితమైన పరాక్రమం కలవాడు. అతిలోక ప్రతిభను, మహిమలను ప్రదర్శించే యుధిష్ఠిరుడు అతడే.

**43. కురుకులశేఖరుం డతఁడు ఘోరరణంబుల నెట్టిశత్రులున్**
**శర ణని వచ్చి రేని విలసత్కరుణామతిఁ గాచు; నీవు చె**
**చ్చెరఁ జెడి పోక నాపనువు సేసి వినీతి యెలర్ప నమ్మహా**
**పురుషుని నాశ్రయింపుము; విభుండును నీ దగుతప్పు లోఁగొనున్.**

**అరణ్య. 6-208**

**తాత్పర్యము :** ధర్మరాజు కురువంశంలో శ్రేష్ఠుడు. అజాతశత్రువు. ఎట్టి శత్రువే కాని, తనను ఆశ్రయించి శరణువేడితే దయామయుడై ఆ శత్రువును కాపాడగల స్వభావం కలవాడు. ఓ జయద్రథా! ఇప్పటికిని మించిపోయింది లేదు. నామాట విని నీవు ఆ మహానుభావుడిని వెంటనే శరణువేడుము. మహాత్ముడైన ధర్మరాజు నీ తప్పు క్షమించగలడు. ఇది నీకు తుది అవకాశం సుమా!

**44. ఘనజవసత్త్వచారుతురగంబులఁ బూనినయుల్లవిస్ఫుర**
**త్కనకరథంబుపై నుదితకాయుఁడు సాలమహీరుహంబుచా**
**డ్పునఁ దనరారుచున్ బెరయు భ్రూకుటియున్ దశనోష్ఠపీడనం**
**బును నయి యున్నవాఁ డనిలపుత్త్రుఁడు భీముఁడు భీముఁ డాజులన్.**

**అరణ్య. 6-209**

**తాత్పర్యము :** ఈ భీమసేనుడి పరాక్రమం మానవులకు సాధ్యం కానిది. అతడికి ఎక్కడా ఎదురు లేదు. అతడికి అతడే సాటి. అతడి శౌర్యం బహుముఖమైనది. అచ్చెరువు కలిగించేది. గర్వంచేత మదించిన రాజులు

భీమసేనుడిని యుద్ధంలో ఎదిరించటానికి జంకుతాడు. ఆ మహావీరుడికి కోపం వచ్చిందా, ఇక అతడు ప్రళయకాలంలోని అగ్నిహోత్రుడే ఔతాడు. ఏ విధంగాను ఉపశమించడు.

**45. ధర్మజుకూర్మితమ్ముఁడును దత్ప్రియశిష్యుఁడు నైనవాఁడు స**
**త్కర్ముఁడు వాఁడె చూడుము ప్రగాఢవితీర్ణిజితేంద్రియుండు దు**
**ష్కర్ములఁ గన్న సైఁపఁడు నికామభయంకరవిక్రమక్రియా**
**నిర్మథితారి ఫల్గునుఁడు నిర్మలతేజుఁ డజేయుఁ డేరికిన్.** అరణ్య.6-211

**తాత్పర్యము :** ధర్మరాజుకు ప్రియమైన తమ్ముడు, అతడికి అనువైన శిష్యుడు, మంచి ప్రవర్తన కలవాడు అడుగో చూడుము. అతడే సుమా! అర్జునుడు! అతడు మాహావదాన్యుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు. భయంకరమైన పరాక్రమంచేత శత్రువులను తపింపచేయగలవాడు, స్వచ్ఛమైన వర్చస్సు కలవాడు. ఎవరికిని జయింప శక్యం కానివాడు.

**46. అవశగతిఁ గామరోషా**
**దివికారము లొందినను మదిని ధర్మపథ**
**ప్రవిహతి గానీఁ డతఁ డా**
**దివిజేంద్ర తనూజుఁ డద్వితీయుఁడు పేర్మిన్.** అరణ్య.6-212

**తాత్పర్యము :** అతడు దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు. కామము, క్రోధము మొదలైన వికారాలు మనస్సును ఆక్రమించినా, ధర్మమార్గం దెబ్బతిననీయకుండా చేయగల దిట్ట. ఆ విధమైన పెద్దతనంలో అతడు సాటిలేనివాడు.

**47. కనియెన్ గోమలనీలమేఘసుభగాకారున్, జటావల్కలా**
**జినధారున్, సితభూతి భూషితుని, రాజీవాక్షుఁ గల్యాణకీ**
**ర్తనుఁ, గాకుత్థ్సకులప్రదీపకుని, సీతాలక్ష్మణోపేతు, స**
**న్ముని లోకార్చితు, సత్కృపాభరణు, రామున్, రాజచూడామణిన్.**
అరణ్య.6-309

**తాత్పర్యము :** సుకుమారమైన నీలమేఘం వంటి సుందరమైన ఆకారం కలవాడు, జడలు, నారచీరలు, చర్మాలూ ధరించినవాడు, తెల్లని విభూతితో అలరారుతున్నవాడు, కమలములవంటి కన్నులు కలవాడు, శుభం కలిగించే స్తుతి కలవాడూ, కాకుత్స్థ వంశానికి పెద్దదీపం వంటివాడూ, సీతతో లక్ష్మణునితో కూడినవాడూ, మహామునుల సముదాయంతో పూజింప బడేవాడూ, సత్కృపయే అలంకారమైనవాడూ, రాజులకు తలలోని మణివంటివాడూ అయిన రాముని భరతుడు చూచాడు.

**48. ఎడపక వాఙ్మనః క్రియల నేరికి హింస యొనర్పఁ బూన; రె**
**య్యెడలను దీనులం గరుణ యేర్పడఁ బ్రోవన చూతు; రిచ్చుచో**
**గడమ వడంగనీ కెదిరి కాంక్షితముల్ దుది ముట్టఁ దీర్తు; రె**
**క్కుడు మదిఁ గూర్తు రాశ్రితులకున్; విను మిన్నియు నార్యధర్మముల్.**
**అరణ్య. 7-227**

**తాత్పర్యము :** ఆర్యులు మనస్సుతో గానీ, మాటతో గానీ, చేష్టతో గానీ ఎవ్వరికీ హింస చేయటానికి తలపెట్టరు. ఎట్టి పరిస్థితులలోనైనా దీనులను కరుణ పెంపారునట్లుగా రక్షించటానికే చూస్తారు. ఇచ్చే సందర్భాలలో మిగులు లేకుండా ఎదుటి వాని కోరికలను కడదాకా తీరుస్తారు. ఆశ్రయించినవారికి హృదయాన్ని నిండుగా ఇస్తారు. విను. ఇవన్నీ ఆర్యధర్మాలు.

**49. విద్వత్సంస్తవ నీయ భవ్యకవితా వేశుండు, విజ్ఞాన సం**
**పద్విఖ్యాతుడు, సంయమి ప్రకర సంభావ్యాను భావుండు, కృ**
**ష్ణ ద్వైపాయను డర్థిలోకహిత నిష్ఠంబూని కావించె ధ**
**ర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్ !**
**తిక్కన - విరాట. 1-3**

**తాత్పర్యము :** పండితులు ప్రశంసించే ఉదాత్త కవితావేశం కలవాడు కృష్ణద్వైపాయనుడు. ఆధ్యాత్మిక జ్ఞానంతో సుప్రసిద్ధుడయిన వాడు. మహర్షుల చేత గౌరవించదగిన ప్రభావం కలవాడు. ఆ మహర్షి లోకహితం కేరి ధర్మాద్వైత స్థితిలో భారత సంహితను రచించాడు.

**50. మహితసముజ్జ్వలాకృతులు మానధనుల్ జనమాన్యు లంగనా**
**సహితముగాగ నేమిగతి సమ్యగుపాయనిరూఢ వృత్తిమై**
**నహితుల కప్రభేద్యముగ నాపదుమూఁడగు నేఁడు మత్పితా**
**మహులు చరించి రంతయుఁ గ్రమంబున నా కెఱుఁగంగఁ జెప్పుమా.**
**విరాట.1-44**

**తాత్పర్యము :** గొప్ప తేజస్సుతో ప్రకాశించే ఆకారాలు కలవారు, అభిమానమే ధనమైనవారు, జనుల మన్ననలు పొందేవారు అయిన మాముత్తాతలు పాండవులు ద్రౌపదితోపాటు ఎంతప్రయత్నించినా చెడని ఉపాయంతో, పగవారికి చెడగొట్టటానికి వీలులేనివిధంగా ఆపదమూడవ సంవత్సరం ఎలా గడిపారో దాని నంతా క్రమంగా నాకు తెలియజెప్పు మహాత్మా!

**51. ఎఱిగెడు వారికి నైనను**
**గఱపక తక్క రుచిత ప్రకారము శుభముం**
**గొఱలు హితు లట్లగుట నం**
**దఱకును జెప్పంగ వలయు దగియెడు బుద్ధుల్. విరాట.1-116**

**తాత్పర్యము :** లోకంలో తెలిసనవారెందరో ఉండవచ్చును. కాని, శ్రేయోభిలాషులయినవారు అటువంటి విజ్ఞులకు కూడా బుద్దులు చెప్పకుండా ఉండలేరు. అందుచేత అదనెరిగి అందరికీ తగిన బుద్ధులు చెప్పవలసిందే.

**52. ఎక్కడిమాట? గొల్లతన మించుక యేనియు లేదు నీదెసం**
**జక్కనిమేను నీగఱువచందముఁ గాంతియుఁజూడ వచ్చినన్**
**నిక్కువ మీవు సూర్యశశి నిర్మల వంశజులైనరాజులం**
**దొక్కమహానుభావు తనయుండవు గావలయున్ నరోత్తమా!**
**విరాట.1-281**

**తాత్పర్యము :** ఎక్కడి మాటలివి? నీలో గొల్లతనం కాసంతయినా లేదు. నీ శరీరం చక్కగా ఉన్నది. నీలో గాంభీర్యం ఉన్నది. నీలో కాంతి స్పష్టమవుతూ ఉన్నది. బాగా ఆలోచిస్తే నీవు సూర్యవంశజుడివి కావచ్చును. లేదా చంద్రవంశ జుడివి కావచ్చును.

**53. ఎవ్వనివాకిట నిభమదపంకంబు రాజభూషణరజోరాజి నడఁగు**
**ఎవ్వనిచారిత్ర మెల్లలోకములకు నొజ్జయై వినయంబు నొఱపు గఱపు**
**ఎవ్వనికడకంట నివ్వటిల్లెడుచూడ్కి మానితసంపద లీనుచుండు**
**ఎవ్వనిగుణలత లేడువారాసుల కడపటికొండపైఁ గలయఁ బ్రాఁకు**
**నతడు భూరిప్రతాపమహాప్రదీప**
**దూరవిఘటితగర్వాంధకారవైరి**
**వీరకోటీరమణిఘృణివేష్టితాంఘ్రి**
**తలుఁడు కేవలమర్త్యుఁడె ధర్మసుతుఁడు. విరాట.2-191**

**తాత్పర్యము :** ఎవరి ముంగిట్లో మదపుటేనుగుల శరీరాలనుండి కారే మదజలధారలవలన ఏర్పడిన బురదను ఆయనను సేవించటానికి వచ్చే మహారాజుల అలంకారాల ఒరపిడివలన రాలిన ధూళి రాజిచే కలిగిన దుమ్ము అణచివేస్తుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి ఉత్తమ ప్రవర్తన లోకాలకన్నింటికీ ఆదర్శమై (గురువై) వినయ వర్తనానికి ఒరవడి పెట్టుతుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి కటాక్ష వీక్షణం గొప్ప సంపదలను కలుగుజేస్తుందో, ఎవరి సుగుణాలనే తీవెలు సప్తసముద్రాలు దాటి మేరు పర్వతం మీదకు కలయప్రాకుతాయో అట్టి ధర్మరాజు సామాన్య నరుడా? ఎవరి మహాపరాక్రమమనే పెద్ద దీపం శత్రువుల గర్వమనే అంధకారాన్ని దూరంగా పారద్రోలుతుందో, ఎవరి పాదాలు శత్రువీరుల కిరీటాలలోని రత్నకాంతులతో సదా చుట్టబడి వెలిగిపోతూ ఉంటాయో అటువంటి ధర్మరాజు కేవలం మానవుడా? (కాదు-దివ్యమానవ సదృశుడని భావం).

**54. నీవలమూపు లావు మును నేల వహించిన నాగ కూర్మగో**
**త్రావనిభృద్దిశాకరుల కారయ నూఱటపట్టు గాదె; సం**
**భావన భూజనంబులకుఁ బందువు గాదె; మహోగ్రకోపరే**
**భావిభవంబు వైరులకుఁ గాలము చేరువ గాదె మారుతీ!**
**విరాట.2-193**

**తాత్పర్యము :** స్వామి! భీమసేనా! చక్కని నీభుజంబలం పూర్వం నేలను మోస్తున్న ఆదిశేషుడు, ఆదికూర్మము, ఏడుకులపర్వతాలూ, ఎనిమిది దిక్కుల ఏనుగులు అనేవానికి ఊపిరి పీల్చుకోవటానికి వీలు కలిపించేచోటు కదా! నీవు ప్రసన్నంగా భావించటం భూమిలోని జనులందరకూ పండుగ గదా! నీవు అతితీవ్రంగా కోపం చూపటం పగవారికి కాలం మూడటమే కదా!

**55.** **ఆద్యపురుషోపలాలిత**
**ముద్ద్యోతితరోచిరుద్గమోగ్రం బరిని**
**ర్భేద్యము దివ్యజనన మన**
**వద్యం బిది కార్ము కైకవరము కుమారా!** **విరాట.4-121**

**తాత్పర్యము :** కుమారా! ఆద్యులైన బ్రహ్మ, చంద్రుడు, వరుణుడు అను దేవపురుషులు ప్రేమతో మన్నించినదీ, పైకి ప్రకాశిస్తూ వస్తున్న కాంతులతో భయంకరమైనదీ, ఎట్టి శత్రువులకూ విరుగగొట్టటానికి అలవికానిదీ, దేవలోకంలో పుట్టుక కలదీ అయిన గొప్పవిల్లు ఇది.

**56.** **ప్రియమక్షీణము నాకు నీదెస మదిన్ భీతిప్రదోద్వేగసం**
**శయముల్ చేరఁగ నీను నీకు ఘనరక్షాకల్పనాబుద్ధిని**
**శ్చయ సంపాదిని నాదుదృష్టి నిను నశ్వవ్రాతముం జోక గా**
**లియు రా నీను దృణీకరింపు రిపుదోర్లీలాసముల్లాసమున్.**
**విరాట.4-157**

**తాత్పర్యము :** నాయనా! ఉత్తరా! నీమీద నాకున్నప్రేమ ఎన్నటికీ కొంచెంకూడా తగ్గేదికాదు. నీ మనస్సులో పెద్దగా భయం కలిగించే గుబులును కానీ సంశయాన్ని కానీ రానివ్వను. నీకు గొప్పరక్షణను కల్పిస్తూ బుద్ధితో ఎప్పటికప్పుడు సరిఅయిన నిర్ణయాలు చేయగలిగే స్థితిని కలుగజేస్తాను. నిన్నూ, నీవునడిపే గుఱ్ఱాలనూ తాకటానికి గాలికి కూడా సాధ్యం కాదన్నట్లు చేస్తాను. నీగోవులను దొంగిలించటానికి వచ్చిన పగవారి భుజాలపొంగును గడ్డిపరకలాగా చేసివెయ్యి.

**57. శత్రునృపకాలకూటము,**
**మిత్రామృతవృష్టి, బుధసమీహితసిద్ధి**
**క్షేత్రము, సజ్జనసంస్తుతి**
**పాత్ర మితఁడు మాద్రితొలుతపట్టి నరేంద్రా! విరాట.5-326**

**తాత్పర్యము :** రాజా! ఇతడు నకులుడు. మాపినతల్లి మాద్రీదేవి మొదటికొడుకు. పగవారైన రాజులకు భయంకరమైన విషం. మైత్రి గలవారికి అమృతవర్షం. పండితులు కోరుకొనే కార్యసిద్ధికి పంటపొలం అయినవాడు. మంచివారి గొప్పప్రశంసలకు లక్ష్యం అయినవాడు.

**58. సుకుమారమానసుఁడు, గొం**
**తికిఁ బ్రాణము ప్రాణ మితఁడు, తేజోగణ్యుం,**
**డకుటిలుఁడు, రాజనీతి**
**ప్రకారసంవేది, వంశపావనుఁడు నృపా. విరాట.5-329**

**తాత్పర్యము :** రాజా! ఇతడు మెత్తని మనస్సు కలవాడు. మా అమ్మ కుంతీదేవికి ప్రాణానికి ప్రాణం అయినవాడు. ముఖవర్చస్సును బట్టి చాలా గొప్పవా డని అందరూ భావించటానికి యోగ్యమైనవాడు. వంచించే స్వభావం మచ్చునకు కూడా లేనివాడు. రాజనీతి పద్ధతులన్నీ పూర్తిగా తెలిసినవాడు. వంశాన్ని పవిత్రం చేయగలవాడు.

**59. హరిమేనల్లుఁడు, బాహువీర్యపటుశౌర్యస్ఫూర్తి, త్రైలోక్యసుం**
**దరుఁ, డాచారపవిత్రుఁ, డంచితకళాదక్షుం, డుదారుండు, గా**
**తరసంరక్షకు, డార్యసమ్మతుఁడు, విద్యావైభవోల్లాసి, య**
**త్యురుతేజుండు వరించుఁ గాక యభిమన్యుం డీసరోజాననన్.**
**విరాట.5-364**

**తాత్పర్యము :** శ్రీకృష్ణుని చెల్లెలి కొడుకు, గొప్ప భుజపరాక్రమం లోకానికి తెలిపినవాడు, మూడులోకాలలో అందగాడు, ఆచారంలో పవిత్రమైన వాడు, గొప్పకళలలో ఆరితేరినవాడు, దొడ్డమనస్సు కలవాడు, భయపడినవారిని

పరిరక్షించేవాడు, గొప్పప్రవర్తన గల మహాత్ముల మన్ననగొన్నవాడు, విద్యల సంపదతో విరాజిల్లేవాడు, మిక్కిలి అధికమైన తేజస్సు కలవాడు అయిన అభిమన్యుడు పద్మంవంటి మోముగల ఈ ఉత్తరను వరించుగాక!

**60. నారాయణాభిధానులు**
**వారలు గయ్యంబు సేయు వా రొక్కెడ; నే**
**నూరక నిరాయుధ వ్యా**
**పారతమై నుండువాఁడఁ బరమాప్తుఁడనై. ఉద్యోగ. 1-74**

**తాత్పర్యము :** నారాయణ నామధేయులైన ఆ గోపాలవీరులు యుద్ధం చేస్తారు. నేను ఆయుధాల జోలికి పోకుండా, మిక్కిలి హితుడనయి ఒకచోట ఊరకే ఉంటాను.

**61. సారథ్యం బొనరింపు మ**
**పారకృపాలీల నెల్లభంగుల నా కీ**
**గౌరవమును జిరకాలము**
**గోరినయది, దీని నిమ్ము గుణరత్ననిధీ! ఉద్యోగ. 1-88**

**తాత్పర్యము :** గుణరత్ననిధీ; అంతులేనిదయతో అన్నివిధాలా నారథం నడపేపని చేసిపెట్టు. నేను ఎంత కాలంగానో ఈ మన్ననను కోరుతున్నాను. నాకు దీనిని అనుగ్రహించు.

**62. కౌరవనాథుఁ; డా నహుషుకైవడి నాశముఁ బొందు; వాసవ**
**శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశి వే**
**లారశనాసముజ్జ్వల విలాస మనోహరమేదినీ వధూ**
**సారసమగ్ర భోగముల సన్నుతి కెక్కెడుఁ దానుఁ దమ్ములున్.**
**ఉద్యోగ. 1-210**

**తాత్పర్యము :** దుర్యోధనుడు ఆ నహుషునిలాగా నశించిపోతాడు. ధర్మరాజు దేవేంద్రుని సంపదవంటి సంపదతో విరాజిల్లుతూ గెలుపుపొంది సముద్రతీరమనే మొలనూలుతో తళతళలాడిపోయే విలాసంతో అందంగా

ఉన్న భూమి అనే పెండ్లికూతురివలని నిండైన సుఖాలతో తమ్ములతోపాటు గొప్పవారి ప్రశంసలకు పాత్రుడౌతాడు.

**63.** **పెట్టని కోట నీకు హరి; భీముడు నర్జునుఁడున్ రణంబునం**
**దొట్టిన మంట; లా కొలఁది యోధుల సాత్యకియున్ విరాటుఁడున్;**
**జుట్టపు మేరు పుగ్రరణ శోభితుఁ డీ ద్రుపదుండు; నిన్ను ని**
**ట్టట్టన వచ్చునే సురల కైనను; నొల్లవుగాక చివ్వకున్.** ఉద్యోగ.**1-297**

***తాత్పర్యము :*** శ్రీ కృష్ణుడు నీకు పెట్టనికోట. భీముడు, అర్జునుడు యుద్ధంలో బాగా రగులుకొన్న మంటలు. సాత్యకీ, విరాటుడూ అంత గొప్ప వీరులే. భయంకరమైన కయ్యంలో ప్రతాపంతో వెలుగొందే ఈ ద్రుపదుడు చుట్టాలకు బంగారుకొండ. ఇట్టి నిన్ను దేవతలకైనా ఇలా అలా అని అనవచ్చునా. నీవు పోరునకు ఇష్టపడవు గానీ పూనుకుంటే నిన్ను దేవతలు కూడా ఏమీ చేయలేరు.

**64.** **ద్రోణుడు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణశల్యులుం**
**బ్రాణము లాసుయోధనుని పాలివ యంద్రు; నిజానుజన్ము ల**
**క్షీణ పరాక్రముల్; సుతు లజేయులు; బాహ్లిక సోమదత్తు లా**
**స్థాణున కైన నోడరు; వశంబె జయింపఁగ వారి నేరికిన్?** ఉద్యోగ.**1-299**

***తాత్పర్యము :*** ద్రోణుడూ, భీష్ముడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, శల్యుడూ తమ ప్రాణాలు ఆ దుర్యోధనునకు చెందినవే అంటారు. అతని తమ్ములు తరుగువోని పరాక్రమం కలవారు. కొడుకులు ఎవ్వరికీ గెలువనలవి కాని వారు. బాహ్లిక సోమదత్తులు శివుని ఎదిరించటానికి కూడా వెనుకాడరు. ఎవ్వరైనా అట్టి మహావీరులను గెలువగలరా?

**65.** **అనయము పుట్టె జూదమున యప్పుడ; యెంతయుఁ జిచ్చు వెట్టి కా**
**ల్చినయది నీయుపేక్షయ; వశీకృతచిత్తుడు ధర్మసూతి మె**
**త్తనిపులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టు నంతకు**
**న్వినఁడును గానఁడుం బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?**
ఉద్యోగ.**2-14**

**తాత్పర్యము :** కీడంతా జూదంనాడే పుట్టింది. (ఈకులానికి) పెద్దగా నిప్పుపెట్టి కాల్చింది నీ ఉపేక్షయే. ఆధర్మరాజు గట్టిగా మనస్సును అదుపులో పెట్టుకొన్నవాడు. అందువలననే మెత్తనిపులి. లోకంలో అందరూ తప్పు నీమీద నిలిపేవరకు ఏమాటా వినడు. దేనినీ చూడడు. ఆ తరువాత నీవు గానీ నేను గానీ అతనిని మరలింపలేము.

**66. ఒకటిఁ గొని, రెంటి నిశ్చలయుక్తిఁజేర్చి,**
**మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి,**
**యేనిటిని గెల్చి, యాఱింటి నెఱిఁగి, యేడు**
**విడిచి వర్తించువాఁడు వివేక ధనుఁడు.** ఉద్యోగ.2-37

**తాత్పర్యము :** ఒక దానిని ఆధారంగా చేసుకొని రెండింటిని నిర్ణయించుకోవాలి. మూడింటిని నాల్గింటితో గట్టిగా వశం చేసుకోవాలి. అయిదింటిని గెలవాలి. ఆరింటిని తెలుసుకోవాలి. ఏడింటిని వదలివేయాలి. ఇలా ప్రవర్తించేవాడు వివేకమే ధనం అయినవాడు.

**67. పురుషుండు రెండు దెఱగుల**
**ధర నుత్తము డనగ బరగు, దా నెయ్యెడలం**
**బరుసములు వలుక కునికిన్**
**దురితంబులు వొరయు పనులు దొఱగుట కతనన్** ఉద్యోగ.2-41

**తాత్పర్యము :** ఎక్కడా పరుషవాక్కులు పలకకపోవటం, పాపపు పనులు చేయకపోవటం - ఈ రెండింటిచేతా లోకంలో పురుషుడు ఉత్తముడు అనిపించుకొంటాడు.

**68. వెలఁది జూదంబు పానంబు వేట పలుకు**
**ప్రల్లదంబును దండంబు పరుసఁదనము**
**సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేఁత**
**యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల.** ఉద్యోగ.2-44

**తాత్పర్యము :** స్త్రీ, జూదం, త్రాగుడు, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, డబ్బు వృథా చేయడం అనే ఏడు వ్యసనాలయందు ఆసక్తి చూపరాదు.

**69.** **ఎదిరికి హితమును బ్రియమును,**
**మది కింపును గాఁగఁ బలుకు మాటలు పెక్కై**
**యొదవినను లెస్స; యటుగా**
**కిది యది యన కూరకునికి యెంతయు నొప్పున్.** ఉద్యోగ.2-59

**తాత్పర్యము :** ఎదుటి వాడికి మేలయినవీ, ఇష్టమైనవీ, మనస్సంతోష కరమైనవీ అయిన మాటలు ఎక్కువగా మాటాడగలిగితే మంచిది. అట్లా కాకపోతే ఏమీ అనకుండా నోరు మూసుకొని ఊరుకొనటం ఎంతో మంచిది.

**70.** **నీతిపథంబునన్ బ్రదుక నేర్చుట యుత్తమభంగి; శౌర్యసం**
**జాతములై కరంబలరు సంపద లొందుట మధ్యవృత్తి; య**
**స్ఫీతములైన భారవహ జీవనముల్ దలఁపం గనిష్ఠముల్**
**నీతికి బాహ్యులైన ధరణీవర! మెత్తురె వారి నుత్తముల్.** ఉద్యోగ.2-71

**తాత్పర్యము :** రాజా! నీతిగలదారిలో బ్రదకటం ఉత్తమపద్ధతి. పరాక్రమంతో పుట్టిన గొప్ప సంపదల ననుభవించటం మధ్యపద్ధతి. నీచమైన బరువుమోసే బ్రదుకులు అధమపద్ధతి. నీతిమాలిన వారిని ఉత్తములు మెచ్చుకుంటారా? (మెచ్చుకోరు)

**71.** **ఎల్లయందును దా వసియించు టెల్ల**
**యదియుఁ దనయందు వసియించు టంద్రు వాసు**
**దేవుఁ డనుపేరి కర్థంబు దెల్ల మింత**
**యెఱుఁగు జనులందుఁ దగ వసియించు శుభము.** ఉద్యోగ.2-326

**తాత్పర్యము :** అన్నింటిలో తానూ, అన్నీ తనలో వసియించటం అనేది వాసుదేవుడను పేరుకు అర్థం అని తత్త్వవేత్తలు అంటారు. ఈ విషయం తెలిసిన జనులలో శుభం స్థిరంగా ఉంటుంది.

**72.** **ఆపదఁ గడవం బెట్టఁగ**
**నోపి శుభంబైన దాని నొడఁగూర్పను మా**
**కీ పుట్టువునకుఁ బాండు**
**క్ష్మాపాలుఁడు నిన్నుఁజూపి చనియె మహాత్మా!** **ఉద్యోగ. 3-6**

**తాత్పర్యము :** మహాత్మా! పాండుమహారాజు మా కీజన్మలో ఆపదలనుండి గట్టెక్కించటానికీ, మేలైన దానిని కలిగించటానికీ నిన్ను చూపి వెళ్లిపోయాడు.

**73.** **పగయ కలిగె నేను బాముున్నయింటిలో**
**నున్న యట్ల కాక యూరడిల్లి**
**యుండు నెట్లు చిత్త మొకమాటు గావున**
**వలవ దధిక దీర్ఘ వైరవృత్తి** **ఉద్యోగ. 3-20**

**తాత్పర్యము :** శత్రుత్వమే ఏర్పడితే పాముున్న యింటిలో కాపురమున్నట్లే ఉంటుందిగాని ఒక తడవైనా మనస్సు నిమ్మళంగా ఉండదు. కనుక ఎవరితోనూ దీర్ఘకాలం విరోధంతో ప్రవర్తించడం తగదు.

**74.** **వచ్చె జనార్దనుం డనినవార్తకుఁ బ్రాణము మేని కంతకున్**
**వచ్చిన సేద దేఱుఁ గురువంశపవిత్రచరిత్ర గొంతి; నీ**
**వచ్చుటి కేఁగి పాండవుల యందఱ మా అని చెప్పి మ్రొక్కుచున్**
**గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందినచిత్తమునొప్పి దీర్పుమీ.**
**ఉద్యోగ. 3-134**

**తాత్పర్యము :** కురువంశాన్ని పవిత్రం చేసిన చరిత్రగల కుంతీదేవి జనార్దనుడు వచ్చాడు అనేమాట విన్నంతనే ప్రాణాలన్నీ దేహం అంతటికీ రాగా శ్రమను పోగొట్టుకొంటుంది. ఇదిగోనమ్మా ఈ మ్రొక్కు మీ కొడుకులు పాండవులకు బదులు నేను చేస్తున్నాను అని చెప్పి గట్టిగా కౌగిలించుకొని క్రుంగిపోయిన ఆమె హృదయం వ్యథను నీవు పోగొట్టు.

**75. దానదయాపరుండయిన ధర్మతనూభవు సేమ మెట్లు? పం**
**చాననవిక్రముండగుబకారికి భద్రమె? యస్త్రశస్త్రవి**
**ద్యానిపుణుండు క్రీడి సుఖియా? వినయాభరణుల్ కవల్ సమా**
**ధానసమేతులే? యకట ద్రౌపది సాధ్వి సుఖంబె దానికిన్?**
**ఉద్యోగ. 3-186**

**తాత్పర్యము :** దానాలూ దయా మాత్రమే మహావిషయా లనుకొనే ధర్మరాజు సుఖంగా ఉన్నాడా? సింహం వంటి పరాక్రమం గల భీమునికి భద్రమా? అస్త్రశస్త్ర విద్యలలో ఆరితేరిన అర్జునుడు సుఖంతో మెలగుతున్నాడా? వినయమే ఆభరణం అయిన నకులసహదేవులు చెదరని హృదయంతో ఉన్నారా? అయ్యో! ఆద్రుపదమహారాజు బిడ్డ, పరమపతివ్రత కృష్ణ సుఖంతో ఉన్నదా?

**76. సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ**
**బారముఁ బొంద లేక చెడఁ బాఱిన దైన యవస్థ దక్షు లె**
**వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁ గాని ధర్మని**
**స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవముండెడిన్.**
**ఉద్యోగ. 3-273**

**తాత్పర్యము :** సారమైన ధర్మమూ, స్వచ్ఛమైన సత్యమూ పాపంచేత, బొంకుచేత చెడిపోయేదశను చూస్తూ సమర్థులైనవారు పట్టించుకోక ఉంటే అది వారి వినాశనానికే అవుతుంది. ధర్మాన్ని గట్టెక్కించటానికి, సత్యానికి శుభస్థితి కలిగించటానికి దైవం ఉన్నది.

**77. మునులార! నన్ను విధి యే**
**మని ముసు పుట్టించె నట్టు లయ్యెడుఁ గా కీ**
**వినఁ జవి గాని పలుకులకుఁ**
**బని గలదే యుడుగుఁ డింక బహుభాషణముల్. ఉద్యోగ. 3-325**

**తాత్పర్యము :** మునులారా! బ్రహ్మ నన్ను ఏ విధంగా నిర్ణయించి మునుపు పుట్టించాడో అది అవుతుంది. వినటానికి రుచిలేని యీ మీ పలుకులకు ఇక్కడ పనిలేదు. మీ ఎక్కువ మాటలను ఇంక మానండి.

**78. తోడంబుట్టిన భీమపార్థుల మహాదోర్దర్పముల్ లాంతులై**
**తోడంచుం బెఱవారి దుర్బలుల నెందున్ నచ్చి దైన్యంబునం**
**గూడంబెట్టెదు నీవ పాండుసుతులం గుందింపఁగా సత్యముం**
**బాడిం దప్ప రొకప్పుడుం గినియ రా బంధుత్వ మేలొల్లవో.**

**ఉద్యోగ. 3-334**

***తాత్పర్యము :*** పాండవులు నీకు తోడబుట్టినవారు. అందులో భీముడు, అర్జునుడు గొప్ప భుజగర్వం (ఆత్మవిశ్వాసం) కలవారు. ఆ భుజగర్వాలు మీకు పనికిరానివి అయ్యాయి. ఏ సంబంధములేని, బలసంపద కూడా సరిగా లేని యితరులను సాయం అని పిరికితనంతో తెచ్చుకుంటున్నావు. పైగా నీ అంతట నీవు పాండవులను పెక్కు తీరులతో బాధలు పెడుతూ ఉన్నావు. వారు ఒక్కనాటికీ సత్యాన్నీ న్యాయాన్నీ తప్పరు. మీ మీద కోపింపరు. అటువంటి చుట్టరికాన్ని నీవెందుకు ఇష్టపడవు?

**79. వెన్నుఁడు ప్రీతిఁజెప్పిన సవిస్తర వాక్ప్రచయంబు త్రోవఁ బో**
**వన్న కుమార! యట్లయిన నాయువు శ్రీయును నీకుఁ గల్గు మా**
**కన్నులు సల్లగా నకట! గన్గొనుచుండుదు మేము; నట్లుగా**
**కున్నను నీవ నేర్తు; నిను నొండన నేరము నిండు కొల్వునన్.**

**ఉద్యోగ. 3-348**

***తాత్పర్యము :*** నాయనా! కృష్ణుడు పెక్కుభంగులుగా వివరించి చెప్పిన మాటల దారిలో మెలగు. అలా అయితే ఆయుస్సు, సంపదా నీకు కల్గుతాయి. ఆ చక్కని స్థితిని మా కన్నులు చల్లగా మేము చూస్తూ ఉంటాము. అలా కాకపోతే జరిగేది ఏమిటో నీవే అనుభవిస్తావు. మేము నిండు కొలువులో నిన్ను మరొక మాట అనలేము.

**80. ప్రాంశుపయోద నీలతనుభాసితు, నుజ్జ్వల దండధారుఁ, బిం**
**గాంశుజటాచ్ఛటాభరణు, నాగమపుంజ పదార్థతత్త్వ ని**
**స్సంశయకారుఁ, గృష్ణమృగచర్మ కృతాంబరకృత్యు, భారతీ**
**వంశ వివర్ధనుం, ద్రిదశవందితు, సాత్యవతేయుఁ గొల్చెదన్.** భీష్మ.1-71

**తాత్పర్యము :** పొడవైన మేఘంవలె నీలమైన దేహం గలవాడు, వెలుగులు చిమ్మేదండం ధరించినవాడు, గోరోజనం వంటి కాంతులతో ఒప్పారే జడలగుంపులే ఆభరణం అయినవాడు, వేదాలసముదాయాల పదాల అర్థాలతో ఏర్పడే తత్త్వం విషయంలో సంశయాలను తొలగింపగలవాడు, నల్లని లేడిచర్మంతో చేసిన వస్త్రం ధరించినవాడు, భారతుల వంశాన్ని పెంపొందించిన వాడూ, దేవతలచేతను నమస్కరింపబడేవాడూ, సత్యవతీదేవి కుమారుడు అయిన వేదవ్యాసుని పూజిస్తాను.

**81. అతిగుహ్యం బిది; నీవు భూరికృప నీయధ్యాత్మముం గానఁజే**
**సితి నా కిమ్మెయి; విన్కిఁ గొంతభ్రమవాసెన్; యోగిహృద్ధ్యేయమై**
**యతులైశ్వర్యవిభూతి నొప్పు భవదీయంబైనరూపంబు సూ**
**చుతలం పెత్తెడుఁ; బోలునేని దయఁ జక్షుఃప్రీతిఁ గావింపవే.**
**భీష్మ. 1–206**

**తాత్పర్యము :** ఇప్పుడు నీవు నాకు చెప్పినది పరమరహస్యం. నీవు చాలాదయతో ఆ ఆత్మతత్త్వాన్ని నాకు తెలియజేశావు. ఇది వినటంవలన నాకు కొంతభ్రమ తొలగి పోయింది. యోగులకు హృదయంలో ధ్యానింప దగినది, మరొక పోలికలేనిదీ ఈశ్వరభావం సంపదతో అలరారేదీ అయిన నీరూపం చూడాలనే కోరిక ఉబ్బుకొని వస్తున్నది. నావంటివానికి అది తగును అని నీవు భావిస్తే దయతో నా కనులకు ప్రీతి కలిగించు మహానుభావా!

**82. గంగానందనుఁ గూల్చి, ద్రోణుపని సక్కంజేసి, కౌరవ్యవీ**
**రాంగమ్ముల్ నుఱుమాడి, తత్ప్రబలసైన్యం బెల్ల మాయించి, యి**
**త్తుం గౌంతేయుల కిమ్మహీవలయమున్ దుర్దాంత చంచద్భుజా**
**సంగస్ఫూర్జిత చక్ర విక్రమ కళా సంక్రీడనోన్మాదినై. భీష్మ. 2–153**

**తాత్పర్యము :** నా చేతిని అణచివేయటం ఎవ్వరికీ సాధ్యంకాదు. దానియందు అమరి ఉండటంచేత నాయీచక్రం గొప్పగా వెలుగొంది పోతున్నది. దాని విజృంభణమనే కళకు సంబంధించిన ఆటతో నాకు ఒడలు తెలియటం లేదు. అటువంటి నేను భీష్ముని కూల్చి వేస్తాను. ద్రోణునిపని

ముగించి వేస్తాను. దుర్యోధనుడనే వీరుని అవయవాలను నుగ్గునుగ్గుగా చేసి వేస్తాను. అతని గొప్పబలం గల సేనను మొత్తాన్ని రూపుమాపి వేస్తాను. ఈ పనులన్నీ చేసి కుంతికుమారులకు సమస్తమైన భూమిని ఇస్తాను.

**83. లలితపీతాంబరంబువిలాస మొప్ప**
**సింహనాదోద్భటం బగుచెలువుతోడ**
**మెఱుఁగువెలుఁగును గర్జయు మెఱయ వచ్చు**
**కారుమొగి లనఁ గృష్ణునాకార మొప్పె. భీష్మ. 3-264**

**తాత్పర్యము :** ధరించిన పచ్చటి పచ్చడం అందాలు చిలుకుతూంటే, సింహనాదంతో చెలరేగిన సౌందర్యంతో భీష్ముడి మీదికి వస్తూ ఉన్న కృష్ణుడి ఆకారం వర్షాకాలంలో మెరుపులతో, ఉరుములతో దిగివచ్చే మేఘాన్ని పోలి ఉన్నది.

**84. చిచ్చరకన్ను మూసికొని చేతి త్రిశూలము డాఁచి లీలమై**
**వచ్చినరుద్రు చందమున వ్రాలుదు వీ వనిలోన; నోర్వగా**
**వచ్చునె నిన్ను నెట్టిమగవారికి; నీకృప నాశ్రయింపగా**
**వచ్చితి మెవ్విధిన్ గెలువవచ్చు మహాత్మ! యెఱుంగఁజెప్పవే.**
**భీష్మ. 3-299**

**తాత్పర్యము :** మహాత్మా! నీవు యుద్ధరంగంలోనికి నిప్పులు కురిసే మూడవకన్ను మూసికొని, చేతిలోని త్రిశూలం అనే ఆయుధాన్ని దాచి విలాసంగా వచ్చిపడే రుద్రునిలాగా మామీదికి దూకుతావు. ఎంత మగటిమి కలవానికైనా నిన్ను సహించటం సాధ్యమా? నీ దయను ఆధారం చేసుకోవటానికి వచ్చాము. ఎలా గెలువగలమో దయతో తెలియజెప్పు.

**85. నారదుచేత నిన్ను మునినాథునిఁగాఁగ నెఱింగి యుండుదున్;**
**శౌరియు నీవుఁగూడిన నసాధ్యము లెవ్వియు లేవు; దర్పుదు**
**ర్వారుఁడ వైన నీవలని వైరము గీ డని చెప్పఁజెప్ప నీ**
**కౌరవరాజు మానఁడు; దెగం జెడుఁగా కిటమీఁద భీముచేన్.**
**భీష్మ. 3-432**

**తాత్పర్యము :** నాయనా! నీవు నరనారాయణులలో ఒక ముని వని నారదుడు చెప్పగా వింటూ ఉండేవాడను. కృష్ణుడూ నీవూ కలిస్తే సాధించలేనిదేమీ లేదు. గర్వంతో నిలువరించగల ధీరుడు మరొకడు లేని నీతో పగవద్దయ్యా! అని ఎన్నోమారులు చెప్పాను. అయినా ఈ కౌరవరాజు పగను మానలేదు. ఇకమీద భీమునిచేతితో తప్పకుండా నాశనం అయిపోతాడు.

**86. భీముఁడు నట్టివాఁడె? యరిభీషణ విక్రముఁ డస్మదీయ సం**
**గ్రామజయంబు ప్రాణములు గల్గఁగ సైచునె? పాండవేయు లు**
**ద్దామబలాఢ్యు లాహవము దక్కుదురే? యది గాక వారు నీ**
**చే మును పడ్డపాట్లు దమచిత్తములన్ మఱవంగ నేర్తురే?**

**ద్రోణ. 1-304**

**తాత్పర్యము :** భీముడు అటువంటివాడా? పగవారికి అడలుపుట్టించే పరాక్రమంగల అతడు యుద్ధంలో మన గెలుపును ప్రాణా లుండగా సహిస్తాడా? పాండవు లందరూ భయంకరమైన బలంవిషయంలో ప్రఖ్యాతి కెక్కినవారు. యుద్ధం మానివేసిపోతారా? అంతే కాదు. వారు నీచేత పూర్వం పొందినపాట్లను మరచిపోగలరా?

**87. నాలో సగ మర్జునుఁ డే,**
**నాలమునం దతని కగుట యరుదే యెమ్మె**
**వ్రాలెదనో రిపు లెట్టులు**
**గూలెదరో చూడు నాకుఁ గురుబల మెదురే. ద్రోణ. 2-350**

**తాత్పర్యము :** ఆ అర్జునుడు నాలో అర్ధభాగం. నేను అతడికి యుద్ధంలో అనుకూలంగా ఉండటం ఒక ఆశ్చర్యమా! ఎట్లా విజృంభిస్తానో, శత్రువులు ఏ విధంగా నేలగూలుతారో చూస్తూ ఉండుము. ఈ కురుసైన్యం నాకు ఒక లెక్కా?

**88.** **ద్రోణుఁడు గర్ణుఁడుం గృపుఁడు ద్రోణసుతుండును నేల వాని గీ**
**ర్వాణుల కైననుం జెనయ వచ్చునె యెవ్వరు నాజిఁ గౌరవ**
**త్రాణపరాయణత్వమున దర్పము సూపఁగ లేమి దెల్ల మ**
**క్షీణ పరాక్రముం డయిన క్రీడికి నిక్కపుటల్క వచ్చినన్.** ద్రోణ.**5-23**

**తాత్పర్యము :** ద్రోణుడూ, కర్ణుడూ, కృపుడూ, అశ్వత్థామ అని పేర్కొనటం ఎందుకు? ఆ అర్జునుని ఎదిరించటం దేవతలకు కూడా సాధ్యంకాని విషయం. అతడు తరుగువోని పరాక్రమంకలవాడు. అట్టి అర్జునునకు నిజమైన కోపం వస్తే కౌరవులను రక్షించే గట్టిపట్టుదలతో ఎవ్వరూ పొగరు చూపలే రనేది స్పష్టమైన విషయం.

89. **కలన గురుండు భీష్ముఁడును గాండివిచేఁ బడి; రంగరాజు వా**
**రల కధికుండె; యాతని దురంబున నోర్వఁగలండె; పూని యే**
**వలదని బుద్ధి సెప్పిన నవశ్యము నాతఁడు నిల్చు; నీతనిన్**
**నిలుపుము నీవు; ధర్మసుతునిం దగుమాటలఁ దేర్పఁ జొప్పడున్.**
**కర్ణ.3-267**

**తాత్పర్యము :** యుద్ధంలో బాణవిద్యాగురువు ద్రోణుడూ, భీష్ముడూ అర్జునునిచేతిలో కూలిపోయారు. ఇంక ఈకర్ణుడు వారికంటె గొప్పవాడా? పోరులో అర్జునుని ఓడింపగలడా? నేను ప్రయత్నించి ఆఅర్జునునికి మంచిమాటలు చెబితే అతడు ఆగుతాడు. నీవు కర్ణుణ్ణి ఆపు. ఆపై ధర్మరాజును మంచిమాటలతో శాంతింప జేయవచ్చు.

90. **అనలుఁడు భాస్కరుండును సుధాంశుఁడు నధ్వరసంప్రవర్తకుల్;**
**వినుము నరేంద్ర యీ క్రతువు విష్ణుమయం; బిది నిర్వహించి ర**
**ర్జునుఁడును గర్ణుఁడున్ సమరరూపమునం దగ; నీప్రబంధ మిం**
**పొనరఁ బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్యసంపదల్.**
**కర్ణ.3-397**

**తాత్పర్యము :** అగ్ని, సూర్యుడు, చంద్రుడూ యజ్ఞాన్ని చక్కగా నడిపేవారు. రాజా! విను. ఈ యజ్ఞం విష్ణువే నిలువునా ఉన్నట్టిది. దీనిని అర్జునుడూ, కర్ణుడూ యుద్ధ రూపంలో తగువిధంగా నెరవేర్చారు. చక్కని ఇష్టంతో దీనిని చదివినా, విన్నా నరునకు చిరకాలసౌఖ్యాలూ, సంపదలూ చేకూరుతాయి.

**91. అకట కులం బకారణమ యంతయు నాశము నొందె; నిట్టిదా**
**నికిఁ జొర నొల్లరైరి మహనీయచరిత్రులు నాఁడు పాండవు;**
**ల్సకలము నీవెఱుంగుదు; చలంబును నీసును దక్కి నన్ను సం**
**ధికి నిట రా నొనర్చుట మదిం దలపోయు మదెట్టిశాంతియో!**

**శల్య. 2–363**

**తాత్పర్యము :** అయ్యో! కులమంతా కారణం లేకుండా నాశనం అయిపోయింది. మిక్కిలి కొనియాడదగిన నడవడి కల ఆ పాండుతనయులు ఆనాడే దీనికి పూనుకోవటం ఇష్టంలేనివా రయ్యారు. నీకు అంతా తెలుసు. పట్టుదలా, ఈర్ష్యా లేకుండా వారు సంధికోసం నన్నిక్కడకు పంపటం అది ఏవిధమైన శాంతియో నీమనస్సులో ఆలోచించు.

**92. వినుము కురుక్షితీశుఁడు వివేకవిదూరుఁడు; క్రోధలోభముల్**
**మనమునఁ బేర్చినన్ దురభిమానమునన్ హితు లెంత చెప్పిన**
**న్వినక బహుప్రకారముల నిందకు నోర్చి పరాభవించె స**
**జ్జనులగు పాండుపుత్రుల; నసత్పథవృత్తికిఁ జేటు దప్పునే?**

**సౌప్తిక. 1–37**

**తాత్పర్యము :** నాయనా! అశ్వత్థామా! విను. దుర్యోధనుడు వివేకానికి చాలా దూరమైపోయాడు. క్రోధము, లోభమూ వాని మనస్సులో పెరిగిపోయాయి. నా అంతవాడులేడనే భావంతో, ఎన్నోవిధాలుగా తప్పుపట్టినా, మంచిమాటలు చెప్పినా వినక మంచిదారిలో మెలిగే పాండవులను ఎక్కువగా బాధించాడు. అట్టి చెడ్డమానిసికి చేటు తప్పదు గదా!

**93. తెల్లమిగాగ నేను శివదేవు నెఱుంగుదు; భూతసంచయం**
**బెల్ల జనింప నిల్వఁగ లయింపఁగఁ జేయు నతండె; యవ్విభుం**
**డుల్లమునం గలంప భువనోత్కర విశ్వవిధానయుక్తి వ**
**ర్తిల్లుచు నుండు; భక్తికి విధేయుఁ డమేయుఁడు కౌరవేశ్వరా!**

**సౌప్తిక. 2-109**

**తాత్పర్యము :** కురుచక్రవర్తీ! నేను ఆ శివదేవుణ్ణి స్పష్టంగా తెలిసిన వాడను. ఆతడే సర్వభూతాల సముదాయాలను పుట్టిస్తూ, నిలుపుతూ, మళ్ళీ తనలో కలిపివేసుకుంటూ ఉంటాడు. హృదయంలో చక్కగా భావిస్తే అన్నిలోకాల సముదాయాల సమస్తమైన ఏర్పాటుల సంబంధంతో ఆ మహాదేవుడు ప్రవర్తిస్తూ ఉంటాడు. భక్తికి వశమై మెలగుతాడు. ఏ ఊహలకు, కొలతలకు అందడు.

**94. సలిలసమీపదేశమున సంయమిసంఘము గొల్వఁగా సము**
**జ్జ్వలమహనీయమూర్తి యగు సాత్యవతేయుఁడు తారకాగణం**
**బులనడుమం బ్రదీప్తుఁ డగుపూర్ణసుధాంశునియట్టు లుండ న**
**వ్వలనికిఁ బోక భక్తి నభివాదనమున్ మదిలోనఁ జేయుచున్.**

**సౌప్తిక. 2.55**

**తాత్పర్యము :** నీటికి దగ్గరగా ఉన్న ప్రదేశంలో ముని సమూహం సేవిస్తూండగా ప్రకాశించే గొప్ప ఆకారం కల వ్యాసుడు నక్షత్రాల సమూహాల మధ్య ప్రకాశించే నిండు చంద్రునివలె ఉండగా (భీముడు) ఆ వైపు పోక, భక్తితో మనస్సులో నమస్కరిస్తూ.

95. **తేరు శరీరము దానికి**
**సారథి సత్త్వంబు తురగచయ మింద్రియముల్**
**దారుణతరబుద్ధివ్యా**
**పారము లొనరంగ గనపపగ్గము లధిపా!** **స్త్రీ. 1-57**

**తాత్పర్యము :** రాజా! ఈ శరీరం ఒకబండి. దానికి సారథి మనస్సు. ఇంద్రియాలు గుఱ్ఱాలు. మిక్కిలికఠినంగా ఉండే బుద్ధి చేసే పనులు గట్టిపగ్గాలు.

**96. వినుము నరేంద్ర విప్రుఁ దలివెం; జమదగ్ని సుతుండు శాప మి**
**చ్చె; నమరభర్త వంచనము సేసె; వరంబని కోరి కుంతి మా**
**న్చె నలుక; భీష్ముఁ డర్ధరథుఁ జేసి యడంచెఁ; గలంచె మద్రరా**
**జనుచితమాడి; శౌరివిధి యయ్యెఁ; నరుండనిఁ జంపెఁ గర్ణునిన్.**

**శాంతి. 1-35**

**తాత్పర్యము :** రాజా! విను. కర్ణుని విషయంలో విప్రునకు కోపం వచ్చింది. పరశురాముడు శాపం ఇచ్చాడు. దేవేంద్రుడు మోసం చేశాడు. వర మని కోరి కుంతి కోపం తగ్గించింది. భీష్ముడు అర్ధరథునిగా లెక్కగట్టి పొంగును తగ్గించాడు. శల్యుడు తగని మాటలు పలికి మనస్సును చెడగొట్టాడు. శౌరి దైవశక్తి అయ్యాడు. అర్జునుడు కర్ణుని చంపాడు.

**97. ఫలముల యెడ బ్రహ్మార్పణ**
**కలనపరుం డగుచుఁ గార్యకర్మము నడపన్**
**వలయుం; దత్త్వ జ్ఞానము**
**దలకొనినం గర్మశమముఁ దానై కలుగున్.** **శాంతి. 1-69**

**తాత్పర్యము :** మానవుడు చేసిన పనుల ఫలములను బ్రహ్మమునకు సమర్పించే నిండు భావనతో తనకు విధింపబడిన కర్మములను చేస్తూ ఉండాలి. పరమాత్మకు సంబంధించిన సమగ్రమైన జ్ఞానం ఏర్పడినప్పుడు కర్మములు వానియంతటఅవిగా అణగిపోతాయి.

**98. వల నధికంబుగాఁ గలుగు వైద్యులు శాస్త్రము లభ్యసించి మం**
**దుల నొడఁగూర్పి నేర్చి తనుదోషము లారయు బుద్ధి గల్గి యా**
**ర్తులకుఁ చికిత్స సేసెదరు; రోగము వాయమి లేదె? వారు రో**
**గులగుట గాన మెట్లు? ప్రతికూలవిధిన్ నరునేర్పు ద్రోచునే?**

**శాంతి. 1-215**

**తాత్పర్యము :** చక్కని నేర్పుగల వైద్యులు శాస్త్రగ్రంథాలను నేర్చుకొని, మందులను రూపొందించటంలో సమర్థతను సాధించుకొని, శరీరంలోని

దోషాలను పట్టుకొనేశక్తిని సమకూర్చుకొని, రోగాలతో బాధపడేవారికి చికిత్స చేస్తూ ఉంటారు. అయినా రోగాలు పోకపోవటం ఉన్నది కదా! పైగా వారు కూడా రోగు లవుతున్నారు గదా! కనుక మానవుని నేర్పు అనుకూలంగాలేని విధిని తప్పించలేదు.

**99. మనుజులు సేయ రెవ్వరు; సమస్తము నీశ్వరునాజ్ఞఁ జెల్లెడు;**
**న్వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నఱకంగఁ బాప మొం**
**దునొకొ కుఠారమున్; జనులు దోసముఁ బొందరు; కర్త యీశ్వరుం**
**డనియెడి నిశ్చయంబు దృఢమై మది నిల్చినఁ జాలు భూవరా!**

**శాంతి. 1-277**

**తాత్పర్యము :** రాజా! నిజానికి మనుజులు ఏమీ చేయరు. అంతా ఈశ్వరుని ఆజ్ఞతో నడుస్తూ ఉంటుంది. విను. గొడ్డలి చేతబట్టిన వాడు చెట్లను నరికితే పాపం గొడ్డలికి వస్తుందా? కాబట్టి పాపఫలాన్ని మనుష్యులు పొందరు. అయితే కర్త యీశ్వరుడు అనే చెదరనిబుద్ధి ఏర్పడాలి.

**100. యదువంశంబున వాసుదేవుఁ డనఁ గ్రీడార్థంబు జన్మించి దు**
**ర్మదదైత్యావలిఁ గూల్చి పార్థునకు సారథ్యంబు త్రైలోక్యస**
**మ్మద మారంగ నొనర్చి దేవముని సమ్మానోద్ధృతిన్ భూభరం**
**బు దొలంగించిన చక్రి నంబురుహనాభుం గొల్తుఁ గృష్ణాత్మునిన్.**

**శాంతి. 2-47**

**తాత్పర్యము :** యదువంశంలో వసుదేవునకు వినోదంగా కుమారుడై పుట్టాడు. చెడ్డపొగరుతో విర్రవీగే రక్కసిమూకలను కూల్చివేశాడు. మూడులోకాలకు ఆనందం వెల్లివిరిసే విధంగా (పొంగి పొరలే విధంగా) అర్జునునికి రథం నడిపాడు. దేవలోకపు మునుల (దేవతల, మునుల) సమ్మానం మిన్నులుముట్టే విధంగా భూభారం తొలగించాడు. అటువంటి చక్రాయుధధారిని, నాభియందు కమలం గల దేవుని కృష్ణస్వరూపంతో కంటిలో కదలాడే స్వామిని నేను అర్చించుకుంటాను.

**101. దమమును సత్యముం దపము దానము వేదములందుఁ జాపవే**
**దమునను గల్గునైపుణియు ధర్మవిధిజ్ఞతయున్ విరోధిభూ**
**రమణవిమర్దనక్రమవిరాజితశౌర్యము నీకుఁ బోలె నై**
**జము లగువాఁడు వేఱొకఁడు శంతనునందన పుట్టఁ డెన్నఁడున్.**

**శాంతి.2-105**

**తాత్పర్యము :** ఓ భీష్మా! దమమూ, సత్యం, తపోదానాలు, వేదాలలోనూ ధనుర్వేదంలోను అత్యంత నైపుణ్యం, ధర్మోచితమైన జ్ఞానం, శత్రురాజులను వధించి విరాజిల్లే పరాక్రమం - నీవలె సహజసిద్ధంగా కలవాడు, ఏ కాలంలోనూ జన్మించడు.

**102. కుదురు సమస్త ధర్మములకున్ విను సత్యము; యోగమోక్షస**
**త్పదములు సత్యకార్యములు; పాప మసత్యము కంటె నొండు లే**
**దు; దలఁప నశ్వమేధములు తొమ్మిదినూఱులు వెండి నూఱునై**
**యొదవిన నీడు గావు భరతోత్తమ! సత్యముతోడ నారయన్.**

**శాంతి.3-419**

**తాత్పర్యము :** భరతశ్రేష్ఠా! విను. సర్వధర్మాలకూ మూలమైన ఆధారము సత్యము. యోగము, మోక్షము, సత్ అనే స్థితులు సత్యంవలన ఏర్పడేవి. అసత్యంకంటె పాపం మరొకటి లేదు. వేయి అశ్వమేధయాగాలు కూడినా సత్యానికి సాటిరావు.

**103. సకలరత్నపూర్ణ సర్వవసుంధరా**
**చక్రదానవిధియు సరి యనంగ**
**రాదు; విశ్వవేదరాశిసారాధ్యాత్మ**
**విద్య యిచ్చుటకు వివేకధుర్య.** **శాంతి.5-159**

**తాత్పర్యము :** గొప్పవివేకం నిలువెల్లా నింపుకొన్న కుమారా! గొప్ప విలువగల వజ్రవైడూర్య మాణిక్యాదులతో నిండిన వలయాకారంగా ఉన్న భూమిని మొత్తంగా దానమివ్వటం కూడా వేదాలరాశులన్నింటిసారం అయిన అధ్యాత్మజ్ఞానాన్ని ఇవ్వటంతో సాటి కాదు.

**104. ఒరు లేమేమి యొనర్చిన**
**నరవర! యప్రియము తనమనంబున కగుఁ దా**
**నొరులకు నది సేయ కునికి**
**పరాయణము పరమధర్మపథముల కెల్లన్. శాంతి. 5-220**

**తాత్పర్యము :** రాజా! 'ఇతరులు ఏమేమి చేస్తే తన మనస్సునకు అప్రియంగా ఉంటుందో, ఆ పనులను తాను ఇతరులకు చేయకుండా ఉండడమే అన్ని ధర్మమార్గాలకూ ఉత్తమమైన ఆలంబనగా ఉన్నది'.

**105. మిత్రత్వము శత్రుత్వముఁ**
**బాత్రతయు నపాత్రతయును బరికించు సుచా**
**రిత్రుఁడు చిరతర గణనా**
**సూత్రితముగ దాన నెల్ల శుభములు నొందున్ శాంతి. 5-289**

**తాత్పర్యము :** తొందరపడక చాలాసేపు విచారించి 'ఇతడు మిత్రుడు, ఇతడు శత్రువు, ఇతడు యోగ్యుడు, ఇతడు అయోగ్యుడు' అని పరిశీలించే సచ్చరిత్రుడు – సమస్తమైన శుభాలనూ పొందుతాడు.

**106. వినుము జరానుబంధమున వెంద్రుకతండముఁ బండ్లు వీనులుం**
**గనుగవయున్ జరం బొరయుఁ గాని యొకప్పుడుఁ దృష్ణ జీర్ణ గా**
**దనయముఁ బేర్చి ప్రాణముల నన్పక పో దది రోగ మల్పబు**
**ద్ధి నరులు ద్రోవ లేరది మదిం జొరనీరు సుఖార్థులై బుధుల్.**
**అను. 1-147**

**తాత్పర్యము :** ముసలితనం వచ్చినపుడు దాని ననుసరించి వెంద్రుకలు, దంతాలూ, చెవులూ ముదిమిని పొంది శక్తిని కోల్పోతూ ఉంటాయి. కానీ ఆశ మాత్రం ఎప్పటికీ తరిగిపోదు. మరింతగా పెరిగి పెరిగి ప్రాణాలు పోగొట్టి గానీ అది పోదు. అది గొప్పరోగం. కొంచెంపాటిబుద్ధిగలవారు ఆ ఆశను త్రోసివేయలేరు. వివేకం నిండుగా ఉన్నవారు సుఖాన్నికోరినవారై దానిని హృదయంలోనికి రానివ్వరు.

**107. అవనీభారము వాపి తాహరికిం దోడై భీమసాహాయ్య గౌ**
**రవదుర్దాంత పరాక్రమంబునఁ; గృతార్థత్వంబునంజేసి య**
**స్త్ర వితానంబును నిన్నుఁబాసి చనియెన్; దైవప్రకారజ్ఞ నీ**
**దువరిష్ఠాచరణంబునన్ సురలు సంతోషించి రప్పోరులన్.**

**మౌస. 220**

**తాత్పర్యము :** దైవం తీరుతెన్నులు చక్కగా తెలిసిన ధనంజయా! భీముని సాయంతో మరింత గొప్పతనం సంతరించుకొన్న పరాక్రమంతో శ్రీకృష్ణునకు తోడై భూభారాన్ని పోగొట్టావు. నెరవేరిన ప్రయోజనం కల అస్త్రాలు నిన్ను వదలి వెళ్లిపోయాయి. ఆ పోరులలో మిక్కిలి గొప్పదైన నీపనికి దేవతలు కూడా సంతోషించారు.

**108. వినుము పాండవ కౌరవ విషయమైన**
**యట్టి యితిహాస మే నుపాఖ్యానజాత**
**సహిత మగునట్లుగా సమస్తంబు మహిత**
**విస్తరంబుగఁ జెప్పితి విశదభంగి** **స్వర్గ. 74**

**తాత్పర్యము :** "రాజా! వినుము, పాండవ కౌరవులకు సంబంధించిన ఇట్లాంటి ఇతిహాసాన్ని ఉపకథలతో చేర్చి మొత్తం కథనంతా మిక్కిలి వివరణాత్మకంగా బాగా స్పష్టమైన రీతిలో నేను చెప్పాను" అని వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో అని పలికెను.

❖ ❖ ❖

అనుబంధం

# పాండవోద్యోగము

**(శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు)**

**శతావధానులు**

**109.** అదిగో ద్వారక! యాలమంద లవిగో నందందు గోరాడు! న
య్యదియే కోట, యదే యగడ్త, యవె రథ్యల్, వారలే యాదవుల్
యదుసింహుండు వసించుమేడ యదిగో! ఆలాన దంతావళా
భ్యుదయంబై వరమందురాంతర తురంగోచ్ఛుండమై పర్వెడిన్.

**110.** బావా! యెప్పుడు వచ్చి తీవు ? సుఖులే భ్రాతల్ సుతుల్ చుట్టముల్?
నీవాల్లభ్యముపట్టు కర్ణుడును మన్నీలున్ సుఖోపేతులే?
మీ వంశోన్నతి గోరుభీష్ముడును మీ మేల్గోరు ద్రోణాదిభూ
దేవుల్ సేమముమై నెసంగుదురె? నీ తేజంబు హెచ్చించుచున్.

**111.** చెల్లియొ చెల్లకో తమకు జేసిన యెగ్గులు సైచి రందఱుం
దొల్లిగతించె నేడు నను దూతగ బంపిరి సంధి సేయ నీ
పిల్లలు పాపలుం బ్రజలు పెంపు వహింపగ బొందు సేసెదో !
యెల్లి రణంబు గూర్చెదవొ? యేర్పడ జెప్పుము కౌరవేశ్వరా.

**112.** అలుగటయే యెఱుంగని మహామహితాత్ముడజాతశత్రుడే
యలిగిననాడు సాగరములన్నియు నేకము గాకపోవు క
ర్ణులు పదివేవురైన నని నొత్తురు చత్తురు రాజరాజ! నా
పలుకులు విశ్వసింపుము విపన్నుల లోకుల గావు మెల్లరన్.

**113.** జెండాపై కపిరాజు ముందు సితవాజిశ్రేణియుం గూర్చి నే
దండంబుగొని తోలుస్యందనము మీద న్నారి సారించుచుం
గాండీవమ్ము ధరించి ఫల్గునుడు మూకం జెండుచున్నప్పు డొ
క్కండు న్నీ మొఱ యాలకింపడు కురుక్ష్మానాథ సంధింపగన్.

114. సంతోషంబున సంధి చేయుదురె? వస్త్రం బూడ్చుచో ద్రౌపదీ
కాంతం జూచిననాడు చేసిన ప్రతిజ్ఞల్ దీర్ప భీముండు నీ
పొంత న్నీ సహజన్ముఁ ద్రొమ్ము రుధిరమ్ము న్ద్రావునాడైన ని
శ్చింతం ద్వద్గదయుం ద్వదూరుయుగమున్ ఛేదించునాడేనియున్.

115 పాండవులైన నుండవలె భారతవంశము నిల్ప లేక మే
ముండవలెం ద్వదీయసహితోక్తికి నిక్కము మాఱు పల్కు లు
ద్దండఁ గుటుంబనాశకుఁడ ధూర్తుఁడఁ బుట్టితి సైపు మమ్మరో
భండన మాచరింతు బలవంతపుదీవెన యిచ్చి పంపుమా.

116. ఒక్కని జేసి నన్నిచట నుక్కడగింప దలంచినావె! నే
నెక్కడ బోఁగలాడ? నిక నిక్కడ జిక్కితి బక్కికైవడిన్
దక్కితి నీకు, బట్టు మొగి దక్కకు మిట్టిటు చేర రమ్ము బల్
చక్కనియూహ పుట్టె ననుజన్ములతో నరుదెమ్ము పార్థివా.

---

## కృతజ్ఞతలు


ఈ క్రింది గ్రంథకర్తల/ప్రచురణకర్తల సౌజన్యముతో

ఈ **తెలుగు మహాభారత రత్నమాల - 2** సిద్ధము చేయబడినది.

వారందరికి ధన్యవాదములు

(ఈ క్రింది గ్రంథములలో పద్యముల అర్థతాత్పర్యములు కలవు.)

1. "కవిత్రయవిరచిత శ్రీమదాంధ్ర మహాభారతము" - తి.తి.దేవస్థానములు
2. "కవిత్రయ భారత జ్యోత్స్న" - డా|| శలాక రఘునాథశర్మగారు
3. "శ్రీ మహాభారత సూక్తి సుధార్ణవము" - డా|| చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డిగారు

&

4. "పాండవోద్యోగము" - శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు

# తెలుగు మహాభారత సహస్రాబ్ది ఉత్సవ సమితి

గౌరవాధ్యక్షులు : పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు
**పూజ్యశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారు**
కుర్తాళం పీఠాధిపతులు, తమిళనాడు.

కార్యాధ్యక్షులు : **డా॥ వరప్రసాదరెడ్డి గారు,** పద్మభూషణ్ సన్మాన గ్రహీత

సంయోజకులు : **శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం గారు,** ఐ.ఏ.ఎస్.(రి)
ముఖ్యకార్యదర్శి(రి), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

**డా॥ రేమెళ్ళ అవధానులు గారు**
వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ వేదభారతి.

**గౌరవ సభ్యులు :**

**డా॥ టి.హెచ్. చౌదరి** గారు, పద్మశ్రీ సన్మాన గ్రహీత
**శ్రీ ఎల్. నరసింహారెడ్డి** గారు, ప్రధాన న్యాయమూర్తి (రి) పాట్నా హైకోర్టు.
**డా॥ బి. శివశంకరరావు** గారు, న్యాయమూర్తి (రి) ఆం.ప్ర. హైకోర్టు.
**శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు** గారు, ఐ.ఏ.ఎస్.(రి), ముఖ్యకార్యదర్శి(రి.), ఆం.ప్ర.
**డా॥ కె.వి. రమణాచారి** గారు, ఐ.ఏ.ఎస్.(రి), కార్యదర్శి(రి), తెలంగాణ ప్రభుత్వం.
**శ్రీ వి.వి. లక్ష్మీనారాయణ** గారు, ఐ.పి.ఎస్.(రి), ఎ.డి.జి.పి.(రి), మహారాష్ట్ర.
**ప్రొ. పొదిలె అప్పారావు** గారు, కులపతి(రి), హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
**శ్రీమతి సత్యవాణి** గారు, అధ్యక్షురాలు, భారతీయం.
**శ్రీ తణికెళ్ళ భరణి** గారు, సినీ నిర్మాత, దర్శకులు.
**డా॥ కోరాడ సుబ్రహ్మణ్యం** గారు, ప్రొఫెసర్(రి), హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
**ప్రొ. కసిరెడ్డి వెంకటరెడ్డి** గారు, ప్రొఫెసర్(రి), ఉస్మానియా విశ్వవిద్యాలయం.
**డా॥ యం.వి.ఆర్. శాస్త్రి** గారు, సంపాదకులు(రి), ఆంధ్రభూమి పత్రిక.
**డా॥ అనంతలక్ష్మి** గారు, అసోసియేట్ ప్రొఫెసర్.(రి), రైల్వే డిగ్రీ కళాశాల.
**శ్రీ యం.వి.ఆర్. శర్మ** గారు, సంపాదకులు, దర్శనమ్ పత్రిక.
**శ్రీ వోలేటి పార్వతీశం** గారు, ప్రోగ్రామ్ ఆఫీసర్(రి), దూరదర్శన్.
**శ్రీ ప్రయాగ రామకృష్ణ** గారు, కార్యదర్శి(రి), టి.టి.డి. ధర్మప్రచార పరిషత్.
**శ్రీ ఉప్పులూరి ఆత్రేయశర్మ** గారు, ప్రధాన సంపాదకులు, మౌస్ ఇండియా పత్రిక.
**శ్రీ సింగం లక్ష్మీనారాయణ** గారు, సంయోజకులు *INPACH* సంస్థ.